ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
గురువారం 13-08-2026 పేజీలు : 16

## విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై చర్చించిన సీఎం



MCRHRDలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్

భేటీలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం

7 పేజీలో...

## ప్లాస్టిక్‌కు చెక్..
### గుడ్డ సంచికి జై

- యువతే పర్యావరణ పరిరక్షణకు వారధి
- ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత
- ప్లాస్టిక్ వినియోగంతో తీవ్ర అనర్థాలు
- కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలి
- వినియోగదారులకు పర్యావరణంపై అవగాహన
- ఉచితంగా గుడ్డ సంచుల పంపిణీ 7లో...

## సివిల్ సప్లయిస్ డిపోర్టమెంట్ పైన
# ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్, విజన్ ఆంధ్ర ఆగస్టు12 : ఆగఎంసీఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో సివిల్ సప్లయిస్ డిపోర్టమెంట్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర,సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి,ఇతర ఉన్నతాధికారులు. డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుండి బకాయిలను వసూలు చేయాలి, బకాయిల వసూలుకు ఒక విధానాన్ని రూపొందించాలి.. క్యాబినెట్ సబ్ కమిటీ లో దీని పైన చర్చించి నిర్ణయం తీసుకోవాలి.. బకాయిల వసూలే ప్రధాన లక్ష్యం గా చర్యలు ఉండాలి.. మిల్లర్ల బ్లాక్ మెయిల్ ను సహించను..

ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలి.. మార్కెట్ లో ఉన్న గోడౌన్ లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.. అవసరమైతే మిల్లింగ్



బాధ్యతల్ని మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగిస్తాం.. 5 నియోజకవర్గాల్లో మహిళా సంఘాల కు 50 నుంచి 100 ఎకరాల్లో గోడౌన్ ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్టు చేపట్టాలి.. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలి..

గోడౌన్ ల నిర్మాణం లో గ్రామీణ ఉపాధి హామీ పథకం లో నిధులను వినియోగించు కోవాలి.. ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలని అన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో..
# దంపతుల ఆత్మహత్య,
## అనాథలైన పిల్లలు

నిజామాబాద్ ఆగస్టు12:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ నగరంలో నోటరీ నగర్ తన సొంత పిల్లల్ని అక్క వాళ్ళ ఇంటి దగ్గర ఉంచి భర్త ఉరేసుకున్నాడు

తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒక వివాహిత జంట తమ ప్రాణాలను తీసుకుని, వారి చిన్న పిల్లలను దిక్కులేని అనాథలుగా మార్చిన హృదయవిదారక సంఘటన చోటుచేసుకుంది. ఈ దంపతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఆర్థిక ఒత్తిడితో సతమతమవుతున్నారు, చివరికి ఇది వారిని ఈ తీవ్ర నిర్ణయం తీసుకునేలా చేసింది. ఈ ఆకస్మిక మరణం పట్ల పొరుగువారు, బంధువులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



తల్లిదండ్రుల లాలనప లేక అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొంటున్న పిల్లల పరిస్థితిని చూసి కలచివేసింది. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి ఈ విషాదం వెనుక ఉన్న పరిస్థితులపై వివరణాత్మక విచారణ ప్రారంభించారు. అలాగే శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందించడానికి చర్యలు చేపట్టారు.

# ప్రసవం కోసం వస్తే ప్రాణమే పోయింది..

### సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీ అనిత మృతి, బంధువుల ఆగ్రహం

సంగారెడ్డి డెస్క్,విజన్ ఆంధ్ర ఆగస్టు12 : ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణీ ప్రాణాలు కోల్పోయిన ఘటన బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర విషాదాన్ని నింపింది. వైద్యుల నిర్లక్ష్యమే తమ కూతురు చావుకు కారణమని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. చౌటకూర్ మండలం బద్రి గూడెం గ్రామానికి చెందిన అనిత( 33) సంవత్సరాలు భర్త శ్రీశైలం,9 నెలల గర్భిణీ అయిన ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 10వ తేదీన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఈరోజు ఉదయం 5 గంటల సమయంలో అనితకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి మృతి చెందిందని వైద్యులు తెలుపుతున్నారు. అనిత మృతి వార్త తెలియడంతో





ఆగ్రహించిన బంధువులు వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. సమయానికి సరైన వైద్యం అందించలేదు. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం చేయడం వల్లే అనిత ప్రాణాలు కోల్పోయింది అని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత డాక్టర్లు మరియు వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఆసుపత్రి ఆవరణలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

సమాచారం అందుకున్న సంగారెడ్డి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న బంధువులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకం ఉంచి పేద రోగులు వస్తే వైద్యులు సరైన చికిత్స నిర్వహించగా పోవడంతో పేద ప్రజలు మృతి చెందుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు

# హుస్నాబాద్ అభివృద్ధిపై విమర్శలకు ఇదే సమాధానం!

- అభివృద్ధి అంటే మాటలు కాదు..
- నిబద్ధతతో పనులు చేయడం

అక్కన్నపేట, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై విమర్శలు చేస్తున్న వారికి జరుగుతున్న అభివృద్ధి పనులే సమాధానమని కాంగ్రెస్ నాయకుడు నందారం బాలరాజు అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు, వంతెనలు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, పర్యాటకం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విమర్శలు చేయడం సులభం.. అభివృద్ధి సాధించడం కష్టం ప్రతి సమస్యపై స్పందిస్తూ, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి ఫలాలు అందేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని నందారం బాలరాజు అన్నారు. హుస్నాబాద్‌ను కేవలం ఒక నియోజకవర్గంగా కాకుండా అభివృద్ధి, పర్యాటకం, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు.

నేడు కనిపించని అభివృద్ధి రేపు చరిత్రగా నిలుస్తుందని, రాజకీయ విమర్శలకు కాకుండా ప్రజల అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తున్నామని నందారం బాలరాజు స్పష్టం చేశారు.

హుస్నాబాద్ అభివృద్ధి ఆగదు.. అభివృద్ధి ప్రస్థానం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.



## మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

బోథ్. ఆగస్టు 12. (విజన్ ఆంధ్ర) : మహారాష్ట్ర లోని చంద్రాపూర్ లో గల ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ ఆలయ ప్రస్థానాన్ని ఆలయ పూజారులు ఎమ్మెల్యే దంపతులకు వివరించారు. చంద్రాపూర్ మహంకాళి ఆలయం గోండ్ రాజుల కాలం నాటి ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి చెందిందని. ఈ ఆలయ చరిత్ర చంద్రాపూర్ గోండ్ రాజవంశంతో ముడిపడి ఉందనీ తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వ గెజిటీయర్ ప్రకారం, ఆలయాన్ని రాణి హీరాయ్ పునర్నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని తెలియజేసారు. శతాబ్దాల చరిత్రను, గోండ్ రాజుల వారసత్వాన్ని తనలో నిక్షిప్తం చేసుకున్న ఈ మహంకాళి ఆలయం నేటికీ మహారాష్ట్రతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల భక్తులకు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగంగా సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# పేదల కళ్లల్లో వెలుగులు నింపడమే లక్ష్యం..



## శస్త్రచికిత్స అనంతరం కూడా వైద్య సేవలు కొనసాగింపు

తలకొండపల్లి , ఆగస్టు 12, (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి లో పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీ ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం. గత నెలలో 10 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న 153 మంది పేషెంట్లకు ఉచితంగా శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు.

శస్త్రచికిత్స చేయించుకున్న పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు తలకొండపల్లి పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో పునః సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నై నుంచి వచ్చిన శంకర నేత్రాలయ ప్రముఖ వైద్య బృందం పేషెంట్ల కళ్లను పరీక్షించి, శస్త్రచికిత్స అనంతర ఆరోగ్య పరిస్థితిని పరిశీలించింది. కంటి సంరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వైద్యపరంగా పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సూచనలు, సలహాలు అందించారు.

ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పేద ప్రజలకు కంటి వైద్యం అందించడమే లక్ష్యంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శస్త్రచికిత్స చేయించడంతో సేవ ముగియకుండా, అనంతరం కూడా పేషెంట్ల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ పునః సమీక్ష నిర్వహించడం సుంకిరెడ్డి సేవా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.

గత నెలలో నిర్వహించిన శిబిరంలో 153 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని, వారి ఆరోగ్య పరిస్థితిని మరోసారి వైద్య బృందంతో పరిశీలించేందుకు ఈ పునః సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. పేదల కళ్లల్లో వెలుగులు నింపే లక్ష్యంతో భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

పునః సమీక్షకు హాజరైన పేషెంట్లు మాట్లాడుతూ.. ఖరీదైన కంటి శుక్లాల శస్త్రచికిత్సల ను ఉచితంగా చేయించడంతో పాటు, శస్త్రచికిత్స అనంతరం వైద్యుల ద్వారా పునః సమీక్ష నిర్వహించడం, ఉచితంగా కంటి అద్దాలు అందించడం పట్ల సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమ కళ్లకు మళ్లీ వెలుగులు అందించిన ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, సర్పంచ్ కళ్యాణ్ నాయక్, ఉప సర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, ఫౌండేషన్ సభ్యులు విజయ్, శ్రీపతి, శేఖర్, శివ, శ్రీను, చెన్నై వైద్య బృందం, పేషెంట్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తొర్రూరు నూతన విద్యుత్ శాఖ DEగా కృష్ణ బాధ్యతల స్వీకరణ..

మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 12(విజన్ ఆంధ్ర ): తొర్రూరు మండల నూతన విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డిఇ)గా కృష్ణ గారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు కృష్ణ గారికి శుభాకాంక్షలు తెలిపారు. తొర్రూరు డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా, ప్రజలకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యల పరిష్కారం, విద్యుత్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆకాంక్షించారు.

# రాయదుర్గంలో భూ కేటాయింపులపై బీఆర్ఎస్ పోరుబాట

- అక్రమాలను బయటపెట్టేందుకే మాల్కం చెరువు వద్దకు వచ్చాం:
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- ఇద్దరు ప్రైవేటు వ్యక్తులకు ఆరు ఎకరాల భూమి కేటాయించారంటూ ఆరోపణ
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అప్పనంగా కట్టబెట్టారని విమర్శ
- పేదల ఇళ్లను కూల్చివేస్తూ.. పెద్దలకు భూములు కట్టబెడుతున్నారని ధ్వజం
- కేటీఆర్ ఆదేశాలతో పీఎం ఏక్తా యూనిట్ మాల్ పనుల పరిశీలన
- భూ కేటాయింపులపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: బీఆర్ఎస్ నేతలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): రాయదుర్గం మాల్కం చెరువు సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ నిర్మాణ పనులపై బీఆర్ఎస్ నేతలు దృష్టి సారించారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో జరుగుతున్న అక్రమాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు



రాయదుర్గం ప్రాంతంలోని నిర్మాణ పనులు, భూ కేటాయింపులపై పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. రాయదుర్గం ప్రాంతంలో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులకు సుమారు ఆరు ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని ఆయన ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన భూమిని అప్పనంగా కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదలు ఇళ్లు నిర్మించుకుంటే వాటిని కూల్చివేస్తున్న ప్రభుత్వం.. కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కేటాయిస్తోందని శంభీపూర్ రాజు ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో పారదర్శకత పాటించాలని, భూ కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇటీవల టెసరాక్ట్ కంపెనీకి సంబంధించిన భూ కేటాయింపుల అంశాన్ని కేటీఆర్ ప్రజల ముందుకు తీసుకొచ్చారని, అదే విధంగా రాయదుర్గంలోనూ జరుగుతున్నాయని భావిస్తున్న భూ కేటాయింపుల అంశాలను వెలుగులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్నాయని ఆరోపిస్తున్న భూ దోపిడీపై బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని శంభీపూర్ రాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలే తప్ప, వ్యక్తిగత ప్రయోజనాలకు కేటాయించకూడదని అన్నారు. కాగా, బీఆర్ఎస్ నేతలు చేసిన భూ కేటాయింపుల ఆరోపణలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. భూమి యాజమాన్యం, కేటాయింపులు, నిర్మాణ అనుమతులకు సంబంధించిన అధికారిక రికార్డులు వెలువడితేనే ఆరోపణలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ప్రీ ప్రైమరీ నియామకాలకు రాజకీయ బ్రేక్ !

- మెరిట్ జాబితా రెడీ... పోస్టింగులు మాత్రం నిలిపివేత!
- ఎంపికైన అభ్యర్థులకు అన్యాయం ఎందుకు?
- టీచర్లు లేక ప్రభుత్వ బడుల్లో గందరగోళం
- కలెక్టర్ జోక్యంతోనైనా నియామకాలు చేపట్టాలి

అక్కన్నపేట, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం చేపట్టిన ఉపాధ్యాయురాలు, ఆయా నియామకాలకు తాత్కాలికంగా బ్రేక్ పడటంపై అభ్యర్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మెరిట్ జాబితా సిద్ధమైనప్పటికీ నియామక ప్రక్రియను నిలిపివేయడంపై సామాజిక కార్యకర్త లింగాల పరశురాములు ప్రశ్నించారు. రాజకీయ జోక్యంతోనే నియామకాలు నిలిచిపోయాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

86 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు

2026--27 విద్యా సంవత్సరానికి జిల్లాలో కొత్తగా 86 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒక్కో పాఠశాలకు ఒక ఉపాధ్యాయురాలు, ఒక ఆయాను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి జూన్ 8 నుంచి 12 వరకు దరఖాస్తులు స్వీకరించారు.

మెరిట్ ఆధారంగా ఎంపిక

ఇంటర్‌తో పాటు పూర్వ ప్రాథమిక విద్య కోర్సు, టీటీసీ లేదా బీఈడీ వంటి అర్హతలు కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన అనంతరం మెరిట్ జాబితాను రూపొందించినట్లు సమాచారం. ఈ జాబితాను జూలై 12న సంబంధిత ఎంఈఓలకు పంపించినట్లు అభ్యర్థులు తెలిపారు.

జూలై 13న పాఠశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచనలు

మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు సమాచారం అందించి, జూలై 13న కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేసి విధుల్లో చేరాలని సూచించినట్లు అభ్యర్థులు పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎంపికైన అభ్యర్థులు విధుల్లో చేరినప్పటికీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో మాత్రం నియామక ప్రక్రియ నిలిచిపోయిందని వారు చెబుతున్నారు.

రాజకీయ జోక్యంపై ఆరోపణలు

నియామక ప్రక్రియ నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా సాగిందని అభ్యర్థులు చెబుతున్నారు. అయితే తమకు అనుకూలమైన వారికి పోస్టులు దక్కలేదనే కారణంతో కొందరు స్థానిక నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని విద్యాశాఖ నుంచి ఎంఈఓలకు ఆదేశాలు వెళ్లినట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్త లింగాల పరశురాములు అన్నారు.

టీచర్లు లేక బడుల్లో ఇబ్బందులు

ప్రీ ప్రైమరీ తరగతులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా నియామకాలు పూర్తి కాకపోవడం ఆందోళనకరమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

మెరిట్ జాబితా ఉన్నప్పుడు జాప్యం ఎందుకు?

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయి మెరిట్ జాబితా సిద్ధమైన తర్వాత కూడా నియామకాలను నిలిపివేయడానికి కారణమేంటో అధికారులు బహిర్గతం చేయాలని లింగాల పరశురాములు డిమాండ్ చేశారు. నియామకాల్లో ఏవైనా అభ్యంతరాలు లేదా నిబంధనల పరమైన సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

కలెక్టర్, మంత్రి జోక్యం చేసుకోవాలి

నియామక ప్రక్రియపై నెలకొన్న ప్రతిష్టంభనకు జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని, వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని లింగాల పరశురాములు కోరారు. మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా తక్షణమే నియామక ప్రక్రియను పూర్తి చేసి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా జోక్యం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు రైతులకు శాపంగా...

విజన్ ఆంధ్ర చేగుంట ఆగస్టు 12 : మెదక్ జిల్లా చేగుంట నుండి మెదక్ వెళ్లే హైవేలో రైతులు బైఠాయించి యూరియా యాప్ ను ఎత్తివేయాలి అని పొలంపల్లి చౌరస్తా లో పొలంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కొండి మల్లేశం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నాయని పెద్ద ఫోను లేకుండా య ప్ తెలియని రైతులు ఎంతోమంది ఉన్నారని వారికి పంట ఎరువులు బుక్ చేసుకోవడం రాక నానా ఇబ్బందులు పడుతూ ఈరోజు రోడ్డుపై బైఠాయించి యాప్ ను ఎత్తివేయాలని కోరుతున్నామని రైతుల పక్షాన మార్పి సర్పంచ్ మల్లేశం రాస్తాకు నిర్వహించారు ప్రభుత్వ అధికారులు గమనించి ప్రతి ఒక్క రైతుకు పంట ఎరువులు అందే విధంగా చేసే విధంగా పాత విధానాన్ని తీసుకురావాలని కోరారు చింతకాయల ప్రవీణ్ కొండి ప్రదీప్ స్వామి డి రాజు బత్తుల బాలయ్య చింతకాయల కిషన్ రవి గ రిగ్. రమేష్ యా ట స్వామి నర్సింలు గొల్ల శ్రీను కొండి కాలమ్మ సౌందర్య నాగ లక్ష్మి పూర్ణ రైతులు పాల్గొన్నారు

## ఘనంగా మానసాదేవి బోనాల జాతర

బెల్లంపల్లి, ఆగస్టు 11 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణం కాల్ టెక్స్ కెమికల్ ఏరియాలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మానసాదేవి ఆషాఢ మాస బోనాల జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తొలిసారిగా నిర్వహించిన జాతరకు 12, 13వ వార్డులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కౌన్సిలర్లు రాజ్‌కుమార్, తిరుమల వాసు ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా చిన్నారులు భక్తి గీతాలపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను ప్రవీణ్ అభినందించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ భజన బృందాలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఆలయ ప్రధానార్చకుడు హరీష్ శర్మను ఘనంగా



సన్మానించారు. ఈ సందర్భంగా రేణికుంట్ల ప్రవీణ్ మాట్లాడుతూ మానసాదేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన జాతర విజయవంతమైందని, వచ్చే ఏడాది ఇంతకంటే ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజ్‌కుమార్, తిరుమల వాసు, వార్డు నాయకులు గేటు శ్రీనివాస్, గజేందర్, చింతల శ్రీనివాస్, నూనె ప్రభాకర్‌రెడ్డి, నెల్లి సమ్మయ్య, రాజేందర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పరకాలలో ఘనంగా తిరంగా ర్యాలీ

- జాతీయ జెండాలతో కదం తొక్కిన విద్యార్థులు
- దేశభక్తి నినాదాలతో మార్మోగిన పరకాలలి

హనుమకొండ జిల్లాపరకాల

పరకాల: ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ మరియు మండల శాఖల ఆధ్వర్యంలో, పట్టణ శాఖ అధ్యక్షులు లిగాజుల నిరంజన్,లి మండల శాఖ అధ్యక్షులు లికాసాగాని రాజకుమార్‌లి నాయకత్వంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు.

పరకాల ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ బస్టాండ్ సర్కిల్ వరకు కొనసాగింది.

ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా కదం తొక్కారు.

జాతీయ జెండాల రెపరెపలు, విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పరకాల పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల కాంటెస్ట్ ఎమ్మెల్యే లిడా. పగడాల కాళీ ప్రసాద్ రావులి గారు, రాష్ట్ర నాయకులు గుజ్జ సత్యనారాయణ రావులి గారు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, దేశభక్తి భావాలను మరింత బలోపేతం చేయడమే తిరంగా ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.అలాగే ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, జాతీయ సమైక్యతను, ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ర్యాలీలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనడం పట్ల బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తిరంగా ర్యాలీ ద్వారా పరకాలలో దేశభక్తి స్ఫూర్తి మరింత ఉవ్వెత్తున ఎగిసిందని, యువతలో జాతీయ భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని గాజుల నిరంజన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పి జయంతి లాల్, దేవునూర్ మేఘనాథ్, జిల్లా కోశాధికారి రామన్న, పరకాల కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణ చారి,



ఆకుల లావణ్య శ్రీధర్, నాయకులు చందుపట్ల రాజేందర్రెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, పట్టణ మండల ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, పి.మల్లారెడ్డి, దంచనాదుల కిరణ్, సోషల్, పరకాల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, స్పెషల్ మీడియా కన్వీనర్ మెంతుల సురేష్, నాయకులు మార్త బిక్షపతి,మారేడుగొండ భాస్కరాచారి, దుబాసి కృష్ణ ప్రసాద్, కానుగుల గోపీనాథ్, బాసాని సోమరాజు, ముత్యాల దేవేందర్, కోడెల లింగమూర్తి,దాసరి వెంకటేశ్వర్లు, సారంగ నరేష్, కొలనుపాక రేవంత్ సిద్ధు, రంతు,

లింగయ్య,ఐ. నగేష్, =. నవీన్, ఖ. రమేష్, ఖ. వీరాస్వామి, చీ.కొమురయ్య,ఐ. దేవేందర్ గార్లు బూత్ అధ్యక్షులు ఖ. సురేష్, జీ.లింగయ్య, ఐ.అరుణ్, జీ. ఓదెలు,ా. సదయ్య, +. శశిధర్ రెడ్డి, ు.మురళి, ఎ. బిక్షపతి, దీ. శివ,వెంకటేశ్వర్లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ షట్టర్లకు పంచాయతీ నంబర్లు..!



- శంకరంపేటలో 21 వ్యాపార షట్టర్ల నిర్మాణంపై సర్పంచ్ ఫిర్యాదు
- పంచాయతీ కార్యదర్శి తీరుపై సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ అభ్యంతరం
- నూతన గృహ నిర్మాణాలకు డబ్బులు లేనిదే అనుమతులు ఇవ్వడం లేదంటూ ఆరోపణ
- అక్రమంగా 21 షెటర్లు నిర్మించగా 22 షెటర్లకు ఇంటి నంబరు కేటాయింపు
- దాదాపు ఒక ఎకరా స్థలంలో ఎలాంటి నిర్మాణం లేకున్నా 9-55/1 గా ఇంటి నెంబర్ కేటాయింపు.

పెద్ద శంకరంపేట, ఆగస్టు 12: విజన్ ఆంధ్ర : పెద్ద శంకరంపేట గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన 21 వాణిజ్య షట్టర్లకు పంచాయతీ 22 ఇంటి నంబర్లు కేటాయించి, దాదాపు ఒక ఎకరా ఖాళీ స్థలంలో ఎలాంటి నిర్మాణం లేకున్నా అక్రమంగా ఇంటి నెంబర్ కేటాయించి, విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇచ్చారంటూ గ్రామ సర్పంచ్ జంగం రేణుక అధికారులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో పాటు పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి నష్టం వాటిల్లిందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. శంకరంపేట గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణఖేడ్ రహదారి ప్రాంతంలో దాదిగారి రాధాకృష్ణకు సంబంధించిన స్థలంలో గతంలో గృహ నిర్మాణ అనుమతి కోసం రుసుము చెల్లించి అనుమతి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్టు వ్యవహారం కారణంగా నిర్మాణ పనులు కొంతకాలం నిలిచిపోయాయని, తిరిగి నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన సమయంలో వ్యాపార దుకాణాల షట్టర్లకు అనుమతి లేదని సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకురావాలని సూచించినట్లు తెలిపారు.

అయినప్పటికీ గ్రామపంచాయతీ అనుమతి లేకుండానే 21 వ్యాపార షట్టర్ల నిర్మాణాలు పూర్తయ్యాయని సర్పంచ్ ఫిర్యాదులో ఆరోపించారు. ఆయా షట్టర్లకు సంబంధించి పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు కేటాయించడంతో పాటు విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఖాళీ స్థలానికీ నంబర్ కేటాయింపుపై అభ్యంతరం

షట్టర్ల వెనుక ఉన్న సుమారు ఎకరం ఖాళీ స్థలంలో ఎలాంటి నిర్మాణం లేకపోయినా, సంబంధిత అనుమతులు లేకుండానే ఇంటి నంబర్ కేటాయించి పన్ను రశీదు జారీ చేసినట్లు సర్పంచ్ ఆరోపించారు. ఈ వ్యవహారంతో గ్రామపంచాయతీకి రావాల్సిన ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. నూతన గృహ నిర్మాణం కొరకు దరఖాస్తు పెట్టుకున్న వారికి డబ్బులు ఇవ్వందే పనిచేయడం లేదంటూ దరఖాస్తుదారులు సర్పంచ్ గారికి వినతి పత్రం సమర్పించారని పేర్కొన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి

పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మించిన షట్టర్లకు నంబర్లు కేటాయించడం, విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇవ్వడం, ఖాళీ స్థలానికి సైతం నంబర్ కేటాయించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని సర్పంచ్ అధికారులను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పంచాయతీ ఆదాయానికి జరిగిన నష్టాన్ని పరిశీలించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

ఈ వ్యవహారంపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి ఏ డి ఏ నూతన్ కుమార్

సిర్గాపూర్ ఆగస్టు 12 విజన్ ఆంధ్ర : నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ కలిసి బొక్కసాగాన్ పీఏసీఎస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ పై రైతులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

అనంతరం అంతర్గాం, గౌడ్‌గావ్, వాసర్ గ్రామాల్లో వరి, పత్తి, పెసర, సోయాబీన్ పంటలను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి 20 రోజులకు ఒకసారి సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని రైతులకు నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కొత్తగా వచ్చిన యాప్ ద్వారా ఎరువుల కొనుగోలు రైతులకు శాపంగా మారాయి

విజన్ ఆంధ్ర చేగుంట ఆగస్టు 12 : మెదక్ జిల్లా చేగుంట నుండి మెదక్ వెళ్లే హైవేలో రైతులు బైఠాయించి యూరియా యాప్ ను ఎత్తివేయాలి అని పొలంపల్లి చౌరస్తా లో పొలంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కొండి మల్లేశం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేసినారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నాయని పెద్ద ఫోను లేకుండా య ప్ తెలియని రైతులు ఎంతోమంది ఉన్నారని వారికి పంట ఎరువులు బుక్ చేసుకోవడం రాక నానా ఇబ్బందులు పడుతూ ఈరోజు రోడ్డుపై బైఠాయించి యాప్ ను ఎత్తివేయాలని కోరుతున్నామని రైతుల పక్షాన మార్చి సర్పంచ్ మల్లేశం రాస్తాకు నిర్వహించారు ప్రభుత్వ అధికారులు గమనించి ప్రతి ఒక్క రైతుకు పంట ఎరువులు అందే విధంగా చేసే విధంగా పాత విధానాన్ని తీసుకురావాలని కోరారు చింతకాయల ప్రవీణ్ కొండి ప్రదీప్ స్వామి డి రాజు బత్తుల బాలయ్య చింతకాయల కిషన్ రవి గ రిగ్. రమేష్ యా ట స్వామి నర్సింలు గొల్ల శ్రీను కొండి కాలము సౌందర్య నాగ లక్ష్మి పూర రైతులు పాలొనారు



## 'ప్రజా సమస్యలపై చర్యలు తీసుకోవాలి'

### పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్

మందమర్రి, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ కోరారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణకు వినతి పత్రాన్ని అందించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్,బ్లీచింగ్,మురికి కాలువలు,రహదారులపై ఏర్పడిన గుంతలను,విద్యుత్ దీపాలు,పిచ్చి మొక్కల తొలగింపు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే రహదారులపై సంచరిస్తున్న పశువులను నియంత్రించాలని,కోతుల, కుక్కల బెడద నుంచి పుర ప్రజలను రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ పనాస రాజయ్య,ప్రధాన కార్యదర్శి రాజాం,సురేందర్,నాయకులు సతీష్,రమేష్,లింగయ్య,ప్రేమ్ సాగర్,రాజు కుమార్ పాల్గొన్నారు.



## ప్రజల్లో దేశభక్తి,జాతీయ భావన,దేశ ఐక్యతను పెంపొందించాలి

- దేశభక్తి,జాతీయ ఐక్యతకు ప్రతీకగా"హర్ ఘర్ తిరంగా"కార్యక్రమం.
- జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ.
- నందిగామలో మై భారత్ ఆధ్వర్యంలో భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలతో "హర్ ఘర్ తిరంగా"ర్యాలీ...

నందిగామ:ఆగస్టు 12(విజన్ ఆంధ్ర న్యూస్); ప్రజల్లో దేశభక్తి,జాతీయ భావన,దేశ ఐక్యతను పెంపొందించాలని,దేశభక్తి,జాతీయ ఐక్యతకు ప్రతీకగా"హర్ ఘర్ తిరంగా"కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జండాను ఎగురవేయాలి రంగారెడ్డి జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ అన్నారు.

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలో బుధవారం మేరా యువ భారత్ -- రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా"ర్యాలీ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక నాయకులు,యువత, విద్యార్థులతో కలిసి భారత్ మాతాకీ జై అంటూ, ప్రతి ఇంటిపై జాతీయ జాతీయ జండా ఎగురవేయాలనే నినాదాలతో "హర్ ఘర్ తిరంగా"ర్యాలీ నిర్వహించారు.దేశభక్తి,జాతీయ సమైక్యత,స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తి,జాతీయ భావన,దేశ ఐక్యతను మరింతగా పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి భారతీయుఖ్య గర్వంగా జాతీయ జెండాను ఎగురవేసి,త్రివర్ణ పతాకానికి గౌరవం చాటాలని పిలుపునిచ్చారు. భారతదేశ ప్రధానమంత్రి ఇచ్చిన"హర్ ఘర్ తిరంగా"పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమంలో



యువత,విద్యార్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని చాటుకోవాలని అన్నారు.

యువతలో దేశభక్తి భావాన్ని బలోపేతం చేయడం,జాతీయ జెండాపై గౌరవాన్ని పెంపొందించడం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశభక్తి,జాతీయ ఐక్యతను పెంపొందించడంలో నందిగామ ప్రజలు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్,మై భారత్ ప్రతినిధి దానరి శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులు బొమ్మగళ్ల నర్సింహా,నాయకులు

బి.కృష్ణ యాదవ్, ప్రవీణ్ రెడ్డి,అగ్గి ప్రవీణ్ గౌడ్, అగ్గి సురేష్ గౌడ్,తడకల జంగయ్య,గ్రామ యువకులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పుల్కల్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

## - ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### - బీజేపీ పుల్కల్ మండల అధ్యక్షుడు అమ్ముల నవీన్

చౌటకూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర):– హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా పుల్కల్ మండల కేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో భారీ తిరంగా పాదయాత్ర నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి పుల్కల్ మండల కార్యాలయం వరకు జాతీయ జెండాలను చేతబట్టి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీగా తరలివెళ్లారు. 'భారత్ మాతా కీ జై', 'వందే మాతరం' నినాదాలతో పుల్కల్ పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా బీజేపీ పుల్కల్ మండల అధ్యక్షుడు అమ్ముల నవీన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని అన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి పౌరుడిలో జాతీయత, దేశభక్తి మరింతగా పెంపొందాల్సిన అవసరం



ఉందన్నారు. ర్యాలీ ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా హర్ ఘర్ తిరంగా మహిళా ఇన్‌చార్జి కొత్తపల్లి జ్యోత్స్న–అశోక్, తిరంగా ర్యాలీ ఇన్‌చార్జీలు జగన్నాథం, మాజీ మండల అధ్యక్షుడు పాండరి, జనరల్ సెక్రటరీ జగన్ గౌడ్, ఓబీసీ మోర్చా నాయకుడు సంతోష్ కుమార్, కుమ్మరి యాదయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, శివ విజయ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జియో సిగ్నల్ కి అంతరాయము లేకుండా చూడండి



బోథ్. ఆగస్టు 12. (విజన్ ఆంధ్ర) బోథ్ మండలంలో గత మూడు నెలల నుండి జియో నెట్వర్క్ సేవలు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు వాపోతున్నారు. జియో సిగ్నల్ సరిగ్గా ఉండడం లేదని, అంతరాయం లేకుండా సేవలను అందించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా బుధవారం బోథ్ జియో స్టోర్ ఇంచార్జి గుమ్మల వెంకటరమణ కి వినతి పత్రాన్ని అందిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 3 నెలల నుండి సిగ్నల్ సరిగ్గా లేదని, ఇంటర్నెట్ లో కూడా ఓపెన్ అవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్య వారం రోజులో పూర్తి కాకపోతే బోథ్ మండలం లో జియో సిమ్ కార్డు లను పూర్తిగా రద్దు చేసేలా తీర్మానం చేస్తామని, ప్రస్తుతం జియో సేవలు కొనసాగుతున్న సిమ్ కార్డు లను వేరే నెటవర్క్ మారుస్తామని అన్నారు. వినతిపత్రంను అందించిన వారిలో ఎలుక రాజు, మెడిచెల్మ ప్రవీణ్, మాసం అనిల్ కుమార్, షేక్ మున్నిఫ్, సాయి, ప్రశాంత్, నాగేష్, భూమేష్, విజయ్, ముక్రమ్ తదితరులు కలరు.

# బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన ఉదయ్ నాగరాజుకు ఘన సన్మానం




హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 12 : సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజుకు ఘన పౌర సన్మానం జరిగింది. ఈ సందర్భంగా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన సందర్భంగా నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ హాజరై ఉదయ్ నాగరాజుని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ శనిగరం గ్రామానికి చెందిన వ్యక్తి బ్రిటన్‌లోని ప్రతిష్ఠాత్మక హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికవడం తెలంగాణకు, ఉమ్మడి కరీంనగర్ ప్రాంతానికి, ముఖ్యంగా హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు గర్వకారణమని అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉదయ్ నాగరాజు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు, సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన విజయంతో శనిగరం గ్రామం, కోహెడ మండలం, హుస్నాబాద్ నియోజకవర్గం పేరు ప్రపంచస్థాయిలో మరింత మారుమోగాలని కోరుకున్నారు. ఈ పౌర సన్మాన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక నాయకులు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉదయ్ నాగరాజుకి ఘనంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ఆమనగల్లు కల్వకుర్తి అభివృద్ధికి నిధులు కోరిన ఎమ్మెల్యే కసిరెడ్డి.. సీఎంతో భేటీ



కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మొత్తం రూ.80 కోట్లు కేటాయించాలని కోరారు. ఆమనగల్‌కు రూ.30 కోట్లు, కల్వకుర్తికి రూ.50 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అలాగే నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలు, గ్రామపంచాయతీల్లో ఖ+న అభివృద్ధికి మరో రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# 'ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు'

## - కమిషనర్ మురళీకృష్ణ



మందమర్రి, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో ప్రమాదాల నివారణకై త్వరలోనే ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. గద్దె రాగడి ప్రధాన రహదారులపై వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారని చెప్పారు. త్వరలోనే పోలీస్ శాఖ తరపున ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రహదారులపై పార్కింగ్ చేసిన వాహనాలకు పెనాల్టీ (చెలాన్) వేస్తారన్నారు. అవసరమైతే సంబంధించిన దుకాణ యజమానులకు మున్సిపల్ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. అలాగే నేషనల్ హైవే ఆనుకుని వ్యాపారాలు కొనసాగించేవారు నేషనల్ హైవే అథారిటీ అనుమతులు ఎన్‌ఓసి పొందిన తర్వాతనే మున్సిపాలిటీ నుంచి అనుమతులు ఇస్తామన్నారు. లేనిచో మున్సిపల్ శాఖ తరుపున తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణంలో రహదారులపై సంచరిస్తున్న పశువులను త్వరలోనే పట్టుకొని గోశాలకు తరలిస్తామన్నారు. కోతులు, కుక్కలు అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నిత్యం చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు.

# నామమాత్రంగా సఫాయి అప్నా భీమారి భగావ్ కార్యక్రమం

## - హుస్నాబాద్ లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

## - మున్సిపల్ కమిషనర్ పాల్గొనరు తూతూ మంత్రముగా చేతులు దులుపుకుంటున్న పాలకవర్గం



హుస్నాబాద్ ఆగస్టు 11 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ పరిధిలో అన్ని వార్డులలో ఈగలు దోమల నివారణకు మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్య, జ్వరాల బారిన పడుతున్నారు. దింతో వారం రోజులుగా పట్టణ ప్రజలు వాంతులు విరోచనాలతో బాధపడుతున్నారు. దీనికి తోడుగా పట్టణంలో పందులు, కుక్కలు అన్ని వార్డులను స్వైర విహారం చేస్తున్నాయని, ఎవరు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. వర్షాకాలం సీజన్ కావడంతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ గడ్డి పిచ్చి చెట్లు మెలకేత్తడం, మురికి కాలువలలో చెత్త పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇంత దారుణ పరిస్థితి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మున్సిపల్ అధికారులు పాలకవర్గం మాత్రం సఫాయి అప్నా భీమారి బాగావో అనే కార్యక్రమం నామమాత్రంగా నిర్వహించుకుంటూ ఏదో తుతూ మంత్రంగా బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ దులుపుకుంటున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పురపాలక చైర్ పర్సన్ కౌన్సిలర్లు పాల్గొంటున్నప్పటికి మున్సిపల్ కమిషనర్ మాత్రం హాజరు కావడం లేదని విమర్శలున్నాయి. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ సిద్దిపేట మున్సిపల్ కమిషన్ గా ఇంచార్జి ఉండడంతో హాజరుకాలేకపోతున్నారని పాలకవర్గం చెప్తున్నప్పటికీ, మున్సిపల్ కమిషనర్ లేకపోతే సమస్య ఎవరి దృష్టికి తీసుకువెళ్లాలని కొందరు కౌన్సిలర్లు మాత్రం ఆరోపణ చేస్తూనే ఉన్నారు. అన్ని వార్డులలో ఇండ్లలో కూడా దోమలు విపరీతంగా పెరగకుండా ఫాగింగ్ మరియు మందుల దోమల పిచికారి మందును సాయంత్రం వేళలో వేయించాలని ఇండ్లలో కూడా పిచికారి మందు వేయించాలని ప్రజలు కోరుతున్నారు. బహిరంగ ప్రదేశాలు మరియు ఖాళీ స్థలాల్లో విపరీతమైన గడ్డి పిచ్చి మొక్కలు చెట్లు పెరగడంతో శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకవర్గం స్పందించి ప్రజల ప్రాణాల గురించి ఆలోచించాలని ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జియో సిగ్నల్ కి అంతరాయము లేకుండా చూడండి



బోథ్. ఆగస్టు 12. (విజన్ ఆంధ్ర) బోథ్ మండలంలో గత మూడు నెలల నుండి జియో నెట్వర్క్ సేవలు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు వాపోతున్నారు. జియో సిగ్నల్ సరిగ్గా ఉండడం లేదని, అంతరాయం లేకుండా సేవలను అందించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా బుధవారం బోథ్ జియో స్టోర్ ఇంచార్జి గుమ్మల వెంకటరమణ కి వినతి పత్రాన్ని అందిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 3 నెలల నుండి సిగ్నల్ సరిగ్గా లేదని, ఇంటర్నెట్ లో కూడా ఓపెన్ అవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్య వారం రోజుల్లో పూర్తి కాకపోతే బోథ్ మండలం లో జియో సిమ్ కార్డు లను పూర్తిగా రద్దు చేసేలా తీర్మానం చేస్తామని, ప్రస్తుతం జియో సేవలు కొనసాగుతున్న సిమ్ కార్డు లను వేరే నెటవర్క్ మారుస్తామని అన్నారు. వినతిపత్రంను అందించిన వారిలో ఎలుక రాజు, మెడిచెల్మ ప్రవీణ్, మాసం అనిల్ కుమార్, షేక్ మున్సిఫ్, సాయి, ప్రశాంత్, నాగేష్, భూమేష్, విజయ్, ముక్రమ్ తదితరులు కలరు.

## పొలం బాట పట్టిన విద్యార్థులు...

**- పాఠ్యాంశంలో భాగంగా వరినాట్లు వేసిన విద్యార్థులు**

కుకునూరుపల్లి, ఆగస్టు 12,విజన్ ఆంధ్ర :మండల పరిధిలోని చిన్న కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం పొలం బాట పట్టారు. ఈవిఎస్ 5వ తరగతి "సాగు పంటలు "పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి వరి నాట్లు వేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వరి సాగు విధానం, నాట్లు వేయడం తదితర వ్యవసాయ పనులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారని, పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అనుభవించడం ద్వారా వ్యవసాయంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కలిగిందనీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పంజాల ప్రశాంత్ గౌడ్ తెలిపారు.

## గణేష్ నగర్‌లో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు

- సంప్రదాయాలకు ప్రతీకగా ఘనంగా నిర్వహణ
- భక్తులతో కిక్కిరిసిన గణేష్ నగర్, రంగారెడ్డి నగర్
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువత, స్థానికులు
- ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు
- ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందించే పండుగలు: బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 12: (విజన్ ఆంధ్ర); గణేష్ నగర్‌లో అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శరత్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నూతన అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డితో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నాయకులు నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అదేవిధంగా రంగారెడ్డి నగర్‌లో బీజేపీ రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీ నందనం దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమంలోనూ నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాలకు స్థానిక భక్తులు, మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు**

మన సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే పండుగలు ప్రజల్లో ఐక్యతను, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కట్ట కుమార్, పులి బలరాం తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

**ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలి**

గణేష్ నగర్, రంగారెడ్డి నగర్ ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నాయకులు నల్ల జై శంకర్ గౌడ్ ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం కలగాలని ప్రార్థించారు.

## నకిలీ లెక్చరర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిని ఏరివేయాలి**

**- సిద్దిపేట జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎడబోయిన సుధాకర్ రెడ్డి**

అక్కన్నపేట ఆగస్టు 12 విజన్ ఆంధ్ర : నకిలీ సర్టిఫికెట్లతో లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎడబోయిన సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇలాంటి నకిలీ లెక్చరర్ల కారణంగా విద్యా వ్యవస్థ పరువు ప్రతిష్టలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు కష్టపడి పోటీ పరీక్షలు రాసి, మెరిట్ ఆధారంగా నియామకమై నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న లెక్చరర్లకు కూడా నకిలీ వ్యవహారాలు తీవ్ర అవమానాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. నకిలీ సర్టిఫికెట్లు, ఫోర్జరీకి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇంకా పలువురు నకిలీ సర్టిఫికెట్లతో వ్యవస్థలో పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, అటువంటి వారిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఉద్యోగ నియామకాల్లో సర్టిఫికెట్ల ధ్రువీకరణ ప్రక్రియను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాన్ని వ్యక్తిగత సంబంధాలు, హోదాలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా విచారించాలని సూచించారు. విద్యా వ్యవస్థలో నిజాయితీ, నాణ్యత, పారదర్శకతను కాపాడేందుకు అధికారులు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. నకిలీ వ్యవహారాలకు అడ్డుకట్ట పడే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎడబోయిన సుధాకర్ రెడ్డి అన్నారు.

# రుద్ర కన్స్ట్రక్షన్స్‌పై సమగ్ర విచారణ జరపాలి

- కొనుగోలుదారులు నష్టపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి: ఆకుల సతీష్
- దొమ్మర పోచంపల్లి, బౌరంపేట ప్రాజెక్టులపై సమగ్ర దర్యాప్తు
- భూముల హద్దులు, వర్గీకరణపై భౌతిక సర్వే చేపట్టాలి
- డ్రైనేజీ మళ్లింపుపై నీటిపారుదల శాఖతో సాంకేతిక విచారణ
- అనుమతులు, మంజూరైన ప్రణాళికలపై అధికారుల పరిశీలన అవసరం
- ఉల్లంఘనలు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి




దుండిగల్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): దుండిగల్ మండలంలోని దొమ్మర పోచంపల్లి, బౌరంపేట ప్రాంతాల్లో రుద్ర కన్స్ట్రక్షన్స్, రుద్ర అశోక, జేఎన్ఎస్ కన్స్ట్రక్షన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆకుల సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, మున్సిపల్‌కు సంబంధించిన ప్రజా సౌకర్యాల కోసం కేటాయించిన భూములు, చెరువు శికం భూముల వినియోగం, నిర్మాణ అనుమతులు, డ్రైనేజీ మళ్లింపు తదితర అంశాలపై పూర్తి ఆధారాలతో దుండిగల్ తహసీల్దార్, డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దొమ్మర పోచంపల్లిలోని రుద్ర రాయల్ విలేజ్-రెండు ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే నంబర్లు 294/పీ, 295/పీ, 296/పీ, 620/పీ పరిధిలో ప్రాజెక్టు, అప్రోచ్ రోడ్డు, ప్రవేశ ద్వారం, ఆర్చ్ నిర్మాణాలు మున్సిపాలిటీకి బహూకరించేందుకు సిద్ధం చేసిన ప్రజా సౌకర్యాల కోసం కేటాయించిన భూములపై ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు భౌతిక సర్వే ద్వారా నిర్ధారించాలని సతీష్ కోరారు. సర్వే నంబర్లు 615 నుంచి 621 వరకు ఉన్న ఎమినిటీస్ భూములకు సంబంధించి బహూకరణ పత్రం ఆధారంగా సమగ్ర విచారణ జరపాలని, మున్సిపల్ భూముల ఆక్రమణ జరిగిందా, వాటిని అప్రోచ్ రోడ్డుగా చూపించి అనుమతులు పొందారా, అనధికారికంగా ఆర్చ్ నిర్మించారా అనే అంశాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సర్వే నంబర్ 291లోని ప్రభుత్వ భూమి, చెరువు శికం భూముల వర్గీకరణ, వినియోగంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

**డ్రైనేజీ మళ్లింపుపై విచారణ**

గంగాదేవుని చెరువులోకి డ్రైనేజీ, మురుగు నీటిని మళ్లిస్తున్నారనే ఆరోపణలపై నీటిపారుదల శాఖ అధికారులతో సాంకేతిక విచారణ చేపట్టాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. చెరువు పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**బౌరంపేట ప్రాజెక్టుపైనా పరిశీలన**

బౌరంపేటలోని సర్వే నంబర్లు 146, 147లో రుద్ర, జేఎన్ఎస్, అశోక కన్స్ట్రక్షన్స్ పేర్లతో జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించి సర్వే నంబర్ 166/1లో ప్రభుత్వ భూమి వినియోగం లేదా ఆక్రమణ జరిగిందా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని సతీష్ కోరారు. రహదారులు, ప్రహరీ గోడలు, షెడ్లు, విల్లా నిర్మాణాలు, నిర్మాణ అనుమతులపై సమగ్ర విచారణ అవసరమన్నారు. అనుమతులు లేకుండానే రెండంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై రెవెన్యూ, మున్సిపల్, సంబంధిత పట్టణాభివృద్ధి శాఖల అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలోనూ ప్రాజెక్టు రహదారి, అనుమతులకు సంబంధించిన వివాదాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం చర్యలు లేకపోవడంపై సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

సంయుక్త సర్వేకు డిమాండ్ ఈ రెండు ప్రాజెక్టులపై రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రియల్ ఎస్టేట్ నియంత్రణ శాఖల అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాలని సతీష్ కోరారు. భూముల యాజమాన్యం, వర్గీకరణ, హద్దులు, ఆక్రమణలు, నిర్మాణ అనుమతులు, మంజూరైన ప్రణాళికలు, చెరువు ఎఫ్‌టీఎల్, శికం పరిధి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. "ఆరోపణలు వాస్తవమా, కాదా అనేది సమగ్ర విచారణలో తేలాలి. అయితే విచారణ పూర్తయ్యే వరకు వివాదాస్పదంగా ఉన్న భూముల్లో మరింత నిర్మాణం జరగకుండా అధికారులు తక్షణ నివారణ చర్యలు చేపట్టాలి. భవిష్యత్తులో విల్లాలు కొనుగోలు చేసే ప్రజలు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి" అని ఆకుల సతీష్ అన్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ, మున్సిపల్, చెరువు భూములను పరిరక్షించాలని, విచారణ నివేదికను ఫిర్యాదుదారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై చర్చించిన సీఎం

సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు దీనికి సానుకూలంగా స్పందిస్తూ దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్ లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సుముఖత వ్యక్తం చేశారు

విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై చర్చించిన సీఎం

రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరిన ముఖ్యమంత్రి

తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానన్న లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును కొనియాడిన లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరం అని అన్నారు. భేటీలో పాల్గొన్న మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- 'సురక్షా కా తిరంగా'లో భాగంగా జీడిమెట్ల పోలీసుల అవగాహన కార్యక్రమం
- ఈకేఐసీ కంపెనీ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన
- ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్ వివరాలు ఎవరికీ వెల్లడించొద్దు
- ఆన్‌లైన్ లావాదేవీల్లో అప్రమత్తతే శ్రీరామరక్ష
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి
- ఎంఆర్ఎం, జీఆర్ఎం సేవలపై ఉద్యోగులకు అవగాహన



జీడిమెట్ల, ఆగస్టు 12: (విజన్ ఆంధ్ర); సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జీడిమెట్ల పోలీసులు సూచించారు. 'సురక్షా కా తిరంగా' అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో ఉన్న ఈకేఐసీ కంపెనీలో సైబర్ కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఐ ధనుంజయ, ఎస్ఐ ప్రేమ్ సాగర్, పీసీలు నరేష్, సుబ్బారెడ్డి, డబ్ల్యూపీసీ నాజియా పాల్గొన్నారు. కంపెనీ ఉద్యోగులతో పోలీసులు నేరుగా మాట్లాడి ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు, సోషల్ మీడియా ఆధారిత నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని పోలీసులు సూచించారు. ఆకర్షణీయమైన ఆఫర్లు, అనుమానాస్పద లింకులు, నకిలీ గుర్తింపులతో వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్‌కు స్పందించి మోసపోవద్దని హెచ్చరించారు.

తక్షణమే 1930కు సమాచారం

సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారానికి అందుబాటులో ఉన్న మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (వీ=వీ), గ్రీవెన్స్ రెడ్రెసల్ మాడ్యూల్ (+=వీ) గురించి కూడా ఉద్యోగులకు వివరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఖాతాలు, మోసపూరిత ఆఫర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు చురుకుగా పాల్గొని సైబర్ నేరాల నివారణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ పతాక ఆవిష్కరణ



బోథ్. ఆగస్టు 12. (విజన్ ఆంధ్ర) : ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోథ్ మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పతాక ఆవిష్కరణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు షేక్ మున్సిఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన, ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, సంతోష్, నరేష్, సమీర్, శ్రీకాంత్, విద్యార్థులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీపీడీపీ అభివృద్ధి పనులపై గ్రామసభలో సమీక్ష

- వర్షాకాల సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు



నంగునూరు మండలం ఆగస్టు 12 విజన్ ఆంధ్ర : నంగునూరు గ్రామపంచాయతీలో సర్పంచ్ సనాదుల బాల పోచయ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వర్షాకాలంలో గ్రామంలో ఎదురయ్యే సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయడం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం, రోడ్లు, మురుగు కాలువల తదితర సమస్యలను గుర్తించి పరిష్కరించడంపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. జీపీడీపీ ద్వారా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని సర్పంచ్ సనాదుల బాల పోచయ్య అన్నారు. గ్రామసభలో ప్రజలు సూచించిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయి వర్మ, పంచాయతీ కార్యదర్శి నితీష్, ఏఎన్ఎంలు, జీఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఉప సర్పంచ్ కోల శ్రీధర్ గౌడ్, పంచాయతీ వార్డు సభ్యులు చిర్రం సంపత్, రాగుల కృష్ణ, రచ్చ సిద్ధు, గోనపల్లి శివప్రసాద్, అరగొండ నీరజ, ఆరే స్వప్న, పల్లెపు రాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై గ్రామ అభివృద్ధి, వర్షాకాల సమస్యల పరిష్కారంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# ప్లాస్టిక్‌కు చెక్.. గుడ్డ సంచికి జై

- యువతే పర్యావరణ పరిరక్షణకు వారధి
- ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత
- ప్లాస్టిక్ వినియోగంతో తీవ్ర అనర్థాలు
- కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలి
- వినియోగదారులకు పర్యావరణంపై అవగాహన
- ఉచితంగా గుడ్డ సంచుల పంపిణీ




కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రగడ్డ మోడల్ రైతు బజార్‌లో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత సమతుల్య జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని ప్రముఖ పర్యావరణవేత్త లయన్ అన్నం కోటిరెడ్డి పిలుపునిచ్చారు.

- భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ అన్నం కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత యువతపై మరింతగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.

- ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు

కూరగాయలు కొనుగోలు చేసేందుకు రైతు బజార్‌కు వచ్చిన వినియోగదారులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ భూమి కాలుష్యానికి, జీవవైవిధ్యానికి నష్టానికి కారణమవుతోందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పునర్వినియోగించగల సంచులను ఉపయోగించాలని సూచించారు.

- కల్తీ ఆహారంపై అప్రమత్తత అవసరం

కల్తీ ఆహార పదార్థాలను గుర్తించే విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కోటిరెడ్డి సూచించారు. కల్తీ పదార్థాల వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉన్నందున నాణ్యమైన ఆహార పదార్థాలనే కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు.

- ప్లాస్టిక్ కవర్లకు బదులు గుడ్డ సంచులు

ప్లాస్టిక్ కవర్లతో రైతు బజార్‌కు వచ్చిన కొంతమంది వినియోగదారులకు వాటి వల్ల కలిగే నష్టాలను వివరించి, ప్రత్యామ్నాయంగా ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. "ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచి ముద్దు" అనే నినాదంతో వినియోగదారుల్లో చైతన్యం కల్పించారు.

- రైతులు.. వినియోగదారుల భాగస్వామ్యం

ఈ కార్యక్రమంలో రైతు బజార్ సూపర్వైజర్లు ఆంజనేయులు, వి. సుధాకర్, రైతులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## చౌటకూర్‌లో విరబూసిన అరుదైన బ్రహ్మకమలం



చౌటకూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండల కేంద్రంలోని గోపి గౌడ్ ఇంట్లో మంగళవారం రాత్రి అరుదైన బ్రహ్మకమలం పుష్పం వికసించింది. తమ ఇంటి మొక్కకు బ్రహ్మకమలం పూయడం ఎంతో ఆనందంగా ఉందని గోపి గౌడ్ తెలిపారు. ఆషాఢ మాసంలో బ్రహ్మకమలం వికసించడంతో కుటుంబ సభ్యులు పుష్పానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ చిత్రపటం వద్ద మంగళహారతి సమర్పించి పుష్పాన్ని దర్శించుకున్నారు. బ్రహ్మకమలం వికసించిన విషయం తెలుసుకున్న స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

## చేవెళ్లలో నేడు యువ సమ్మేళనం

చేవెళ్ల, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది కార్యక్రమాల్లో భాగంగా చేవెళ్లలో నేడు (గురువారం) యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల ఆర్ఎస్ఎస్ ఖండ సంఘచాలక్ బిల్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు. యువతలో జాతీయ, స్వదేశీ భావనతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమన్నారు. స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువశక్తి జాతీయ శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సర్వాంగీణ వికాసంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువకులు, సామాజిక కార్యకర్తలు, అన్ని రంగాల ప్రముఖులు సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నేడు ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత వేదిక సంయోజక్ అప్పల ప్రసాద్ ముఖ్య వక్తగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా సమావేశం

**- ఆగష్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి**

**- బిజెపి మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలోని వివిల్ రెడ్డి ఫంక్షన్ హాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణపై మండల స్థాయి సమావేశం బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశానికి మండల ప్రభారీ తోట స్వరూప ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అనేది కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదు,ప్రతి భారతీయుడిలో దేశభక్తిని, జాతీయ ఐక్యతను పెంపొందిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే గొప్ప కార్యక్రమం అని అన్నారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చేసి దేశం పట్ల మనకున్న గౌరవాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని,హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.ఆగస్టు 15 వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.మండలంలో విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల శ్రీనివాస్,బూతగడ్డపు బాలరాజు,బైరి అరుణ్, తడిసిన రత్నాకర్,కుంట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ నిధుల అవకతవకలపై విచారణ జరపాలి

**- ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్**

**- పాఠశాల విద్య కమిషనర్‌కు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు**




చేవెళ్ల, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల టీజీఎస్ మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల విద్య కమిషనర్ నవీన్ కోలాస్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల కెరీర్ మార్గదర్శనం, బతుకమ్మ వేడుకలు, బాలల భద్రతకు కేటాయించిన నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని అరుణ్‌కుమార్ కోరారు. రెండు రోజులు మాత్రమే యోగా తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయుడి ఖాతాలో రూ.59 వేల చెల్లింపులు చేయడంపై విచారణ చేపట్టాలన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ, జూ పార్కు విహారయాత్రకు 734 మంది విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.700 అదనంగా వసూలు చేశారని తెలిపారు. క్రీడా సామగ్రి కొనుగోళ్లలోనూ అవకతవకలు జరిగాయని, వాటిపై పూర్తి స్థాయిలో పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకుని, అక్రమాలు నిర్ధారణైతే బాధ్యులను సస్పెండ్ చేయాలని కోరారు. ఫిర్యాదుపై కమిషనర్ నవీన్ కోలాస్ స్పందిస్తూ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, కార్తీక్, నవీన్, పూర్వ నాయకులు అల్లి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీతో మార్మోగిన రోడా మేస్త్రి నగర్

**ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి**

**దేశభక్తి ప్రతి గుండెలో నిండాలి: బీజేపీ నాయకుల పిలుపు**

**పటేల్, కృష్ణవేణి హైస్కూళ్ల వద్ద ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రోడా మేస్త్రి నగర్ 279వ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. రోడా మేస్త్రి నగర్ డివిజన్ కోఆర్డినేటర్, నారాయణపేట జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ భానుచందర్ వర్మ ఆధ్వర్యంలో పటేల్ హైస్కూల్, కృష్ణవేణి హైస్కూల్ వద్ద ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు డా. ఎస్. మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఇన్‌చార్జ్ చక్రధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశభక్తి ప్రతి భారతీయుడి గుండెల్లో ఉండాలని, స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. "హర్ ఘర్ తిరంగా అంటే ప్రతి ఇంటా జాతీయ జెండా మాత్రమే కాదు.. ప్రతి గుండెలో దేశభక్తి నింపుకోవడం" అని పేర్కొన్నారు. ర్యాలీలో బీజేపీ గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, ఓబీసీ మోర్చా జిల్లా ఆఫీస్ సెక్రటరీ వసుంధర, బీజేపీ లేబర్ సెల్ కో-కన్వీనర్ టి. రాము, బీజేవైఎం నాయకులు ఎం. మణి, రచ్చ చక్రధర్, పద్మ ప్రసాద్, సత్యనారాయణ, మురళీకృష్ణ, ఎల్.వి. రెడ్డి, నరేష్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పులి రాజు, మాణిక్య రెడ్డి, రామకృష్ణ, డి. కృష్ణ, మురళి గౌడ్, అఖిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువమోర్చా సభ్యులు భరత్, మంజునాథ్, విక్రమ్, సాయినాథ్ యాదవ్, కిరణ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తూ "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో రోడా మేస్త్రి నగర్‌లో దేశభక్తి వాతావరణాన్ని నెలకొల్పారు.

**దేశభక్తి చాటిన త్రివర్ణ ర్యాలీ**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసి దేశ సమైక్యత, సమగ్రత, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింత బలోపేతం చేయాలని నాయకులు కోరారు.

# పీఎం శ్రీ నిధులపై అవకతవకలేంటి.?

**- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్**



చేవెళ్ల, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : టీజీఎస్ మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీ నిధుల వినియోగంపై అవకతవకలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, పాఠశాల అధికారులను నిధుల వినియోగంపై ప్రశ్నించారు. స్పోర్ట్స్ సామగ్రి కొనుగోలు, యోగా ఉపాధ్యాయుడికి చెల్లింపులు, జూ పార్కు, రామోజీ ఫిల్మ్ సిటీ విహారయాత్ర ఖర్చులపై వివరాలు వెల్లడించాలని నిలదీశారు. 734 మంది విద్యార్థుల నుంచి విహారయాత్ర పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.700 చొప్పున వసూలు చేసిన మొత్తానికి లెక్కలు చెప్పాలని కోరారు. పీఎం శ్రీ నిధుల నుంచి మధువంశీ పేరుతో నగదు డ్రా చేయడంపై కూడా స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. ఒకే వ్యక్తి పేరుతో వేలాది రూపాయలు ఉపసంహరించుకోవాల్సిన అవసరం ఏమిటని అధికారులను నిలదీశారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించకపోవడంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. జిల్లా కలెక్టర్, డీఈవో పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించాలని అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. విచారణలో అవకతవకలు నిర్ధారణైతే బాధ్యులను సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన మొత్తాలపై కూడా అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. వెంటనే విచారణ చేపట్టకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, గణేష్, నవీన్, చందు, తిరుపతి, సుమన్, నరేష్, వంశీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ వార్షికోత్సవం

తొర్రూర్ ఆగస్టు 12(విజన్ ఆంధ్ర) : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ ఐ ఎస్ ఎఫ్ ) 91 వ వార్షికోత్సవం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ కాలేజీలోఘనంగా,నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన లిఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.లి అనంతరం,బందు.మహేందర్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12 న ఉత్తరప్రదేశ్, లక్నోలోనిబెనారస్,యూనివర్సిటీ లో ఏర్పడి భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమం లో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు నిర్వహిస్తూ 90 వసంతాలు పూర్తి చేసుకుంది అని అన్నారు. స్వతంత్రం అనంతరం ఈ దేశంలో శాస్త్రీయ విద్యావిధానం కోసంనిరంతరం,పోరాడుతున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు.అదేకాకుండా ప్రత్యేక తెలంగాణఉ ద్యమం లో ముందుండి అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి జె ఏ సి లు ఏర్పాటు చేసి ఆ జె ఏ సీ లకు నాయకత్వం వహించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం బలోపేతం చేయడం లో ఏఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించింది అని అన్నారు. విద్యార్థి ఉద్యమ సేనాని ఏఐఎస్ఎఫ్ 90 వసంతాలు పూర్తి చేసుకొని నిరంతరం విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తుందని అన్నారు విద్యార్థులు ఏఐఎస్ఎఫ్లో భాగస్వాములై భవిష్యత్ ఉద్యమాలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పేరబోయిన కిరణ్ కుమార్, నాయకులు రవి చందర్, వినయ్ కుమార్, రమేష్ బాబు, కృష్ణమూర్తి, సంజీవ, రత్నకుమార్ పాల్గొన్నారు.

## చౌటకూర్ మండలంలో అభివృద్ధి పనులపై జిల్లా అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ మధులత సమీక్ష

చౌటకూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రోజున వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ మధులత ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వీవీజీ రాంజీ పనులు, జలసిరి కార్యక్రమం, కూలీల సంఖ్య పెంపు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతి, కూలీలకు ఉపాధి కల్పించే విధానం, చేపట్టిన పనుల స్థితిగతులు మరియు జలసిరి కార్యక్రమం అమలు తీరుపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, గ్రామాల్లో ఉపాధి అవకాశాలను మరింత పెంచేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి ప్రయోజనం చేకూరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎంపీడీవో కే. శంకర్, ఏపీఓ రామ్మోహన్, టీఏలు రమేష్, ప్రతాపరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

## భూపాలపల్లి జిల్లాలో విత్తన దుకాణాలపై అధికారుల తనిఖీలు



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 12 ( విజన్ ఆంధ్ర ) రైతులను మోసం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయించే వ్యాపారులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.జిల్లాలో పత్తి సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల దందాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పత్తి విత్తనాల పేరుతో నాసిరకం లేదా నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో స్టాక్, విక్రయ రికార్డులు, విత్తనాల నాణ్యతకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు.జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ రాజేశ్ తదితరులు దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.రైతులు అప్రమత్తంగా ఉండాలి.విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. విత్తనాల ప్యాకెట్పై ఉన్న కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, గడువు తేదీ, ధర తదితర వివరాలను పరిశీలించాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్ర పర చుకోవాలని పేర్కొన్నారు.నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు అనుమానం వచ్చినా, అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని అధికారులు తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించడంతో అక్రమ విత్తన వ్యాపారులకు గుబులు మొదలైంది. రైతులు మాత్రం నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

## నూతన ఎంఈఓ జీవన్ కుమార్ కి మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

పెంట్లవెల్లి, ఆగస్టు 12: (విజన్ ఆంధ్ర) : పెంట్లవెల్లి మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) జీవన్ కుమార్ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పెంట్లవెల్లి మండలానికి ఇటీవల నియమితులైన ఎంఈఓ జీవన్ కుమార్ను బుధవారం మండల యూటీఎఫ్ అధ్యక్షులు కుమారస్వామి, యుటీఎఫ్ ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా స్వాగతిస్తున్నారు.సన్మాన సందర్భంగా పెంట్లవెల్లి మండలంలోని ఉపాధ్యాయులు మాట్లాడుతూ, మీ సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం పూర్తి శ్రద్ధతో పనిచేస్తామని, అలాగే మండలానికి అత్యధిక రిజల్ట్స్ తీసుకువచ్చే దిశగా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. నూతన ఎంఈఓ జీవన్ కుమార్ మాట్లాడుతూ, పెంట్లవెల్లి మండలంలో చదువుతున్న విద్యార్థుల రిజల్ట్స్ అధికంగా రావడానికి మనమందరం సమిష్టి కృషితో పని చేద్దామని, అలాగే మండల ఉపాధ్యాయుల సహకారంతో కలిపి సమగ్రంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.



అనంతరం మండల డిప్యూటీ తాసిల్దార్ కు పి ఆర్ సి , ఇతర పలు డిమాండ్లతో కూడిన మెమోరాండం పత్రాన్ని యుటిఎఫ్ మిగతా ఉ పాధ్యాయులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ ఉపాధ్యాయ బృందం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కురుమయ్య, గర్ల్స్ హై స్కూలు ఉపాధ్యాయుడు నారాయణ, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో హోటళ్లలో గృహ గ్యాస్ సిలిండర్ల వినియోగం.సివిల్ సప్లై అధికారుల తనిఖీలు ఎక్కడ ?

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర ) పట్టణంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో గృహ అవసరాలకు వినియోగించాల్సిన ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉ పయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హోటళ్లలో వంటకు పెద్ద మొత్తంలో గ్యాస్ అవసరం ఉండటంతో కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారనే విమర్శలు ఉ న్నాయి.
గృహ వినియోగం కోసం సరఫరా చేసే 14.2 కిలోల సిలిండర్కు, వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల సిలిండర్కు ధరల్లో గణనీయమైన వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు భూపాలపల్లి ప్రాంతానికి సంబంధించిన జూలై 2026 ధరల వివరాల్లో 14.2 కిలోల గృహ సిలిండర్ ధర రూ.1,014గా, 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,231గా నమోదయింది.
ఈ ధర వ్యత్యాసం కారణంగా కొందరు వ్యాపారులు నిబంధనలను పక్కనపెట్టి డొమెస్టిక్ సిలిండర్లను వంటకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే భూపాలపల్లిలో ప్రస్తుతం ఏయే హోటళ్లలో ఈ విధంగా సిలిండర్లు వినియోగిస్తున్నారనే విషయాన్ని అధికారిక తనిఖీల ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉంది.గతంలోనూ ఫిర్యాదులు
భూపాలపల్లి జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరాకు సంబంధించి



గతంలోనే ఫిర్యాదులు, ఆరోపణలు వెలువడ్డాయి. హోటళ్లు, బేకరీ షాపుల్లో కమర్షియల్ సిలిండర్లకు బదులుగా గృహ వినియోగ సిలిండర్లను నిల్వ ఉంచుతున్నారనే ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వచ్చినట్లు వెల్లడించాయి. భూపాలపల్లిలో తనిఖీలు ఎప్పుడు ? ఇతర ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నప్పటికీ భూపాలపల్లి పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ముఖ్యంగా రద్దీగా ఉండే హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లలో వినియోగిస్తున్న సిలిండర్లను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.
డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, సిలిండర్ల సరఫరా వ్యవస్థలో అక్రమాలకు అవకాశం లేకుండా అధికారులు పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది. భూపాలపల్లి సింగరేణి ప్రాంతంలో సింగరేణి కార్మికులకు వారి పేరు మీద సిలిండర్ ఓ కంపెనీకి చెందిన సిలిండర్ ఉంటుంది. వారికి నెలకి ఒకటి చొప్పున సింగరేణి సంస్థ సరఫరా చేస్తుంది. సింగరేణి కార్మికులకు సంబంధించిన కుటుంబ సభ్యుల పేరు మీద కూడా అదనంగా వేరే కంపెనీ చెందిన సిలిండర్ అదనంగా ఉ ంటుందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రైవేటు హోటళ్లకు రెస్టారెంట్ లకు టిఫిన్ సెంటర్ల కు సరఫరా జరుగుతుందనేది వాస్తవాలల్లో నిజం లేకపోలేదు. ఇక కుటుంబంలో కుటుంబ సభ్యులకు అదనంగా వేరే సిలిండర్ వేరే కంపెనీ ఉంటే గుర్తించగలిగితే ఇలా హోటళ్లకు మరియు రెస్టారెంట్లకు సరఫరా ఆగిపోయే అవకాశం ఉ ందని సివిల్ సప్లై అధికారులు ఈ విషయాన్ని గమనించి వారి కుటుంబంలో రెండు మూడు నాలుగు సిలిండర్లు ఉన్నాయని గమనిస్తే ఈ హోటళ్లకు రెస్టారెంట్లకు, టిఫిన్ సెంటర్ల కు బేకరీలకు డొమెస్టిక్ సిలిండర్ ను అదుపు చేయగలుగుతారని ఈ విషయాన్ని అధికారులు అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## 14న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియ అంశంపై చర్చించాలి ....

**తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి**



హైదరాబాద్: ఈనెల 14న హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే తెలంగాణ కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసే అంశంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకుల తప్పుడు విధానాల కారణంగా ముత్యంపేట (జగిత్యాల జిల్లా), బోధన్ (నిజామాబాద్ జిల్లా), ముంభోజిపల్లి (మెదక్ జిల్లా) లలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసిన కారణంగా చెరుకు రైతులతో పాటు షుగర్ ఫ్యాక్టరీలపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలో మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ సిఫార్సుల కమిటీని ఏర్పాటు చేయగా ఈమేరకు చెరుకు రైతులు, కార్మికుల నుంచి అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించగా 173 కోట్ల రూపాయలను కేటాయించడంతో చెరుకు రైతుల్లో ఆనందోత్సాహాలను కలిగించినప్పటికీ పునరుద్ధరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈనెల 14న హైదరాబాద్ లోని సచివాలయంలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి వేగవంతం చేసే అంశంపై రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించాలని తెలంగాణ

## జలసిరిలో భాగంగా ఫారం పాండ్ నిర్మాణం

**- రైతు అంజయ్యకు అభినందనలు**

**- ఫారం పాండ్‌ను పరిశీలించిన ఎంపీడీవో కే. శంకర్, డీఎల్‌పీవో అనిత**

చౌటకూర్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర):- చౌటకూర్ మండలంలోని పోసాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రైతు అంజయ్య నిర్మించుకున్న ఫారం పాండ్‌ను బుధవారం ఎంపీడీవో కే. శంకర్, డీఎల్‌పీవో అనిత పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫారం పాండ్‌ను నిర్మించుకున్న రైతు అంజయ్యను అధికారులు ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే. శంకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫారం పాండ్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్లను నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, అవసరమైన సమయంలో వ్యవసాయానికి వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. రైతు అంజయ్యను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని ఇతర రైతులు కూడా ఫారం పాండ్ల నిర్మాణానికి ముందుకు రావాలని సూచించారు. వీటిలో నీటిని నిల్వ చేసుకోవడమే కాకుండా చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీఓ సువర్ణ, ఏపీవో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# అపార్ట్‌మెంట్‌లో పేకాట దందా !

**- రూ.3.28 లక్షల నగదుతో ఎనిమిది మంది పట్టివేత**

**- డబ్బులు పందెంగా పెట్టి పేకాట.. పోలీసుల మెరుపుదాడి**

**ఎనిమిది సెల్‌ఫోన్లు, పది సెట్ల పేకాట కార్డులు, నగదు లెక్కింపు యంత్రం స్వాధీనం**

**అపర్ణ సెరినిటీలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న జూదం బట్టబయలు**

**పేట్-బషీరాబాద్ పోలీసుల దాడితో వెలుగులోకి వ్యవహారం**

పేట్-బషీరాబాద్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): అపార్ట్‌మెంట్ వేదికగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట వ్యవహారానికి పేట్-బషీరాబాద్ పోలీసులు చెక్ పెట్టారు. అపర్ణ సెరినిటీ అపార్ట్‌మెంట్‌లో డబ్బులు పందెంగా పెట్టి టీన్ పట్టీ పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అపార్ట్‌మెంట్‌లో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,28,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా పేకాట వ్యవహారానికి ఉపయోగిస్తున్న ఎనిమిది సెల్‌ఫోన్లు, పది సెట్ల పేకాట కార్డులు, ఒక నగదు లెక్కింపు యంత్రాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




పేకాటకు సంబంధించిన నగదు, సామాగ్రిని సీజ్ చేసి, పట్టుబడిన ఎనిమిది మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చట్టపరమైన చర్యలు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అపార్ట్‌మెంట్‌లో పేకాట నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లలో గుట్టుచప్పుడు కాకుండా జూద కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## చౌటకూర్‌లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులపై అధికారుల పరిశీలన

చౌటకూర్, ఆగస్టు 12:- చౌటకూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీడీవో శంకర్, డీఎల్పీవో అనిత బుధవారం పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, వైకుంఠధామం, రైతు వేదిక తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పనులు, ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం యూపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించి నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ భవనాన్ని చక్కగా నిర్మించి, పరిశుభ్రంగా నిర్వహిస్తున్నందుకు సర్పంచ్ పర్కాల రామారెడ్డిని అభినందించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు, ప్రభుత్వ భవనాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను అధికారులు తనిఖీ చేశారు. గ్రామంలో పరిశుభ్రత బాగుందని ఎంపీడీవో, డీఎల్పీవో ప్రశంసించారు. రైతు వేదికను సందర్శించి రైతులకు అందుతున్న



సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామంలో అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో సువర్ణ, పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్, సర్పంచ్ పర్కాల రామారెడ్డి, వార్డు సభ్యులు చక్రపాణి, అశోక్, ఉపాధ్యాయులు సుభాష్, బాబు, అంగన్‌వాడీ టీచర్ అనసూయ, నాయకులు రమాగౌడ్, రమేష్, రాజేశ్వర్ గౌడ్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్, జేఈఈలకు లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ

**-16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ**

**- ప్రిన్సిపాల్ టి హరిబాబు వెల్లడి**

కొడిపల్లి, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : ఇంటర్ పూర్తి చేసిన వెనుకబడిన తరగతుల (బీసీ) విద్యార్థులు జాతీయ స్థాయి నీట్, ఇంజినీరింగ్ విద్యలో ప్రతిభ కనబరిచి, ప్రముఖ ఇంజినీరింగ్ విద్యా సంస్థలు, మెడికల్ కళాశాల్లో సీట్లు సాధించేలా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలు చర్యలు చేపట్టాయనీ, నీట్-యూజీ, జేఈఈ-2027కు గాను ఉచిత లాంగ్‌టర్మ్ రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తోందనీ తునికి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ హరి టి హరి బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులు శిక్షణకు అర్హులని అన్నారు. ఎంపిక విధానం..ప్రవేశాలు మెరిట్, సీట్ల లభ్యత ఆధారంగా కల్పిస్తారు. దరఖాస్తులు పంపిన తర్వాత స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. ప్రవేశం పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలు దాటకూడదు తెలియజేశారు. రెండు కేంద్రాల్లో.. ఈ నెల 9న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ 16వ తేదీ వరకు కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా బాలికలకు నీట్‌లో 100, జేఈఈలో 40 సీట్లు, బాలురకు నీట్‌లో 50, జేఈఈలో 50 సీట్లు ఉన్నాయి. బాలికలకు నిజామాబాద్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) కళాశాల నాగోల్‌లో, బాలురకు నిజామాబాద్ లో అబ్దుల్లాపూర్‌మెట్‌లో



లాంగ్‌టర్మ్ శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా https://mjptbcadmissions.org వెబ్‌సైట్‌లో చేసుకోవాలి. ఉచిత వసతితో పాటు స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. ప్రత్యేక ప్రాధాన్యతతో తరగతులు, మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బీసీ గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నారనీ, దీని ద్వారా మెడిసిన్, ఇంజినీరింగ్ సంస్థల్లో ప్రవేశాలు పొంది, ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడే అవకాశం ఉంటుందనీ తెలిపారు.

# నూతన ఎంఈఓ జీవన్ కుమార్‌కి మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

పెంట్లవెల్లి, ఆగస్టు 12: (విజన్ ఆంధ్ర) : పెంట్లవెల్లి మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) జీవన్ కుమార్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పెంట్లవెల్లి మండలానికి ఇటీవల నియమితులైన ఎంఈఓ జీవన్ కుమార్‌ను బుధవారం మండల యూటీఎఫ్ అధ్యక్షులు కుమారస్వామి, యుటీఎఫ్ ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా స్వాగతిస్తున్నారు.సన్మాన సందర్భంగా పెంట్లవెల్లి మండలంలోని ఉపాధ్యాయులు మాట్లాడుతూ, మీ సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం పూర్తి శ్రద్ధతో పనిచేస్తామని, అలాగే మండలానికి అత్యధిక రిజల్ట్స్ తీసుకువచ్చే దిశగా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు.

నూతన ఎంఈఓ జీవన్ కుమార్ మాట్లాడుతూ, పెంట్లవెల్లి మండలంలో చదువుతున్న విద్యార్థుల రిజల్ట్స్ అధికంగా రావడానికి మనమందరం సమిష్టి కృషితో పని చేద్దామని, అలాగే మండల ఉపాధ్యాయుల సహకారంతో కలిసి సమగ్రంగా పనిచేస్తానని ఆయన తెలిపారు. అనంతరం మండల డిప్యూటీ తాసిల్దార్ కు పి ఆర్ సి , ఇతర పలు డిమాండ్లతో కూడిన మెమోరాండం పత్రాన్ని యుటిఎఫ్ మిగతా ఉపాధ్యాయులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ ఉపాధ్యాయ బృందం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కురుమయ్య, గర్ల్స్ హై స్కూలు ఉపాధ్యాయుడు నారాయణ, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అసైన్డ్ రైతులకు పట్టా పత్రాలు పంపిణీ చేయాలి

- బీఆర్ఎస్ యువనాయకులు కందుకూరి సాయికిరణ్



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర ) : ఫార్మాసిటీ భూసేకరణలో తమ అసైన్డ్ భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు తక్షణమే పంపిణీ చేయాలని బీఆర్ఎస్ యువనాయకులు కందుకూరి సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... మొదటగా అసైండ్ మెంట్ భూములకు పట్టాలు అందజేయకుండ పట్టా భూములకు అందజేయడం సిగ్గుచేటన్నారు. పట్టా భూములు కలిగిన రైతుల కంటే ముందే అసైన్డ్ రైతుల నుంచి భూములను సేకరించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వీరి ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆయన ఆరోపించారు. అధికారులు అసైన్డ్ రైతులకు తగిన సమాచారం అందించడంతో పాటు, వారికి ప్లాట్ పట్టా పత్రాలను అందజేసి న్యాయం చేయాలని ఆయన కోరారు. మొదటగా అసైన్ పట్టాలను తక్షణమే పట్టాలను అందజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైతుల పక్షాన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పాఠశాల, కళాశాల మరియు దేవాదాయ భూముల ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

గోపాలపేట ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గోపాల్‌పేటకు చెందిన డి. నాగరాజు గోపాల్‌పేట మండలం, గోపాల్‌పేట గ్రామానికి చెందిన డి. నాగరాజు, తండ్రి: బాలస్వామి గారు ఈరోజు హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మరియు ప్రజావాణి ఇంచార్జి డా. జి. చిన్నారెడ్డి గారికి ఫిర్యాదు చేశారు.

గోపాల్‌పేట మండల కేంద్రంలో స్కూల్, కాలేజ్ మరియు దేవాదాయ శాఖకు చెందిన సర్వే నెం. 495, 392, 422 లలో ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు.

దీనిపై గతంలో 13.07.2026 నాడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా, మండల సర్వేయర్ బృందంతో సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ, దేవాదాయ భూములను కాపాడాలని కోరారు. ఈ ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న డా. జి. చిన్నారెడ్డి గారు వెంటనే విచారించి, జిల్లా సర్వేయర్ ద్వారా సర్వే



చేయించి, ఆక్రమణలను తొలగించాలని వనపర్తి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఫిర్యాదు Grievance ID: GWANP11082600002 తో నమోదు చేయబడింది.

ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ మరియు దేవాదాయ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తక్షణమే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని నాగరాజు హెచ్చరించారు

## ఆస్పైర్ సమ్మిట్ 3.0లో 'ఈ–కిడ్స్' టీచర్లకు ప్రత్యేక అభినందనలు

– పిల్లల డ్రాప్‌అవుట్ శాతం తగ్గించినందుకు ప్రశంసలు..

-జ్ఞాపికతో పాటు క్యాష్ అవార్డు అందజేత

హైదరాబాద్, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం నిర్వహించిన నారాయణ పాఠశాలల ఆస్పైర్ సమ్మిట్ 3.0 కార్యక్రమంలో ఈ-కిడ్స్ సెగ్మెంట్ టీచర్లకు ప్రత్యేక అభినందనలు లభించాయి.

2026--27 విద్యా సంవత్సరంలో ఈ-కిడ్స్ సెగ్మెంట్‌లో విద్యార్థుల డ్రాప్‌అవుట్ శాతం తక్కువగా ఉండేలా కృషి చేసిన టీచర్లను నారాయణ పాఠశాలల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. వారి సేవలకు గుర్తింపుగా ప్రత్యేక జ్ఞాపికతో పాటు క్యాష్ అవార్డును అందజేశారు.

ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల చైర్మన్ రమా మేడం, జీఎం గోపాల్ రెడ్డి, డీజీఎం రమా రెడ్డి, ఈ-కిడ్స్ ఆర్‌అండ్‌డీ సంగీత మేడం, ఏజీఎం ప్రసాద్, కోఆర్డినేటర్ వరలక్ష్మి మేడం, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభు, ఏవో గజారాం తదితరులు పాల్గొన్నారు.

ఈ-కిడ్స్ టీచర్ల కృషిని గుర్తించి ప్రోత్సహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్ల: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (ఖ్యూజా) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు.

ఈ సందర్భంగా ఖాఖుజీ మండల అధ్యక్షుడు బడికల రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి స్వామి, సభ్యులు రవి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు.

ఖ=జని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఉద్యోగులు-- పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, ఖూాను రద్దు చేసి ఖూాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఖ్యూజా ఆధ్వర్యంలో ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేద్దాం

**యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్‌నగర్ అర్బన్ ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): జాతీయ భావజాలాన్ని యువతలో మరింత పెంపొందించేందుకు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా యాత్ర ఏర్పాట్లు, విజయవంతం చేసే అంశాలపై బుధవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 14న పాలమూరు జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానం నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు.దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మజా రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లు పాండురంగారెడ్డి, పిట్టల యాదయ్య, మర్రి జ్యోతి, కార్యాలయ ప్రముఖులు జాజం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సిబ్బందిని అభినందించిన జీఎం

మందమర్రి, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : సింగరేణి సొత్తును చాకచక్యంగా పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బందిని ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అభినందించారు. బుధవారం జీఎం కార్యాలయంలో అధికారి వెంకటేశ్వర్ రెడ్డి,శ్రీనివాస రావు (ఇంటిలిజెన్స్ గార్డ్) సంజయ్ కుమార్ దాస్(జేఐ),సాగా శ్రీనివాస్ (ప్రైవేట్ గార్డ్) లను శాలువాతో సన్మానించారు. జీఎంతో పాటు ఎస్ఓటు జీయం లలిత్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్ ఉన్నారు.



## గండి ఆంజనేయ స్వామి సన్నిధిలో అమావాస్య ప్రత్యేక పూజలు

గోపాల్ పేట ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర) : అన్నదానం చేసిన హైద్రాబాద్ వాస్తవ్యులు గన్నోజు రామాచారి, చిలకలపూడి రవిచారిలి గోపాలపేట మండలం బుద్దారం గ్రామంలోని ప్రసిద్ధ గండి శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ వాస్తవ్యులు గన్నోజు రామాచారి, చిలకలపూడి రవిచారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శర్మ ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది వారికి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ నాగేష్, పూజారి అనిల్, బిల్లకంటి రాజు, ఉప సర్పంచ్ శివాజీ, సత్యం, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు బిజెపి నాయకులు**

అచ్చంపేట ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపుమేరకు అచ్చంపేట పట్టణంలో బుధవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బిజెపి రాష్ట్ర నాయకులు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు జిల్లా అధ్యక్షులు వేముల నరేంద్రరావు బిజెపి నాయకులు పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా అచ్చంపేట పట్టణంలోని లింగాల చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గువ్వల బాలరాజు అనంతరం జాతీయ జెండాను ర్యాలీలో పట్టుకొని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ పెద్ద ఎత్తున నిర్వహించారు ఈ సందర్భంగా గువ్వల బాలరాజ్ మాట్లాడుతూ దేశభక్తి అంటే కేవలం జెండాను ఎగరవేయడం మాత్రమే కాదు మన దేశాన్ని నిర్మించిన మహనీయులను స్మరించుకోవడం జాతీయ ఐక్యతను చాటడం ప్రతి ఇంట సువర్ణ పథకం రెపరెపలాడే విధంగా చేయడం మన బాధ్యత అని అన్నారు భారతీయుడిలో దేశభక్తి భావనను మరింత బలపరచాలని ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని అచ్చంపేటలో ప్రజల భాగస్వామ్యం చక్కటి ఉదాహరణగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు ఈ ర్యాలీలో వివిధ రంగాల వ్యాపారవేత్తలు కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఏబీవీపీ నాయకులు బీజేవైఎం కార్యకర్తలు పార్టీ శ్రేణులు దేశ భక్తులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు

## ఆసరా పెన్షన్లను సద్వినియోగ పరుచుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి
- తుర్కయంజాల్ పీఏసీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర ) : ప్రజలకు సామాజిక భద్రతను కల్పించేందుకు ఆసరా పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తుర్కయంజాల్ పీఏసీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... దాదాపు 2022 నుండి 2023 సంవత్సరం నుండి కొత్త ఆసరా పెన్షన్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇవ్వకపోవడం వల్లనే తెలంగాణ వ్యాప్తంగా 14 లక్షల్లో పెన్షన్లు పెండింగ్లో ఉండడం వల్లనే పేద ప్రజలు పెన్షన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొందని అన్నారు. ఎప్పటికప్పుడు పెన్షన్లు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని గత ప్రభుత్వాల తప్పిదాల వల్లనే పేదలకు ఆసరా పెన్షన్లు అందలేదన్నారు. దీని ద్వారా ఆర్థిక భారంతో పాటు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, వితంతువులు, ఎంతగానో ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప ఆలోచనతో ప్రతి పేద బిడ్డకి ఆసరా పెన్షన్లను ఇవ్వాలని పేద మరియు మధ్యతరగతి కుటుంబీకులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికిని పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత కార్యాలయాల్లో, లేదా మీ సేవలో అర్హులైన పెన్షన్ దారులు తమ అర్హత పత్రాలు సమర్పించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని కొత్తకుర్మ సత్తయ్య సూచించారు.

## చర్లపల్లి లో వోల్టేజ్ కు చెక్ - కొత్త ట్రాన్స్ ఫార్మర్లతో ఉపశమనం

- ఎమ్మెల్యే చొరవతో రెండు కొత్త 25 కేవీ ట్రాన్స్ ఫార్మర్ల మంజూరు
- ఏళ్లుగా వేధిస్తున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం
- రైతులు,గృహ వినియోగదారులకు ఊరట
- అధికారులతో రంగంలోకి దిగి పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే



జడ్చర్ల,ఆగస్టు 12, (విజన్ ఆంధ్ర): జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామ ప్రజలకు ఏళ్లుగా వేధిస్తున్న లో వోల్టేజ్ సమస్యకు చివరకు పరిష్కారం దొరికింది. గ్రామంలో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో రైతులు, ఇంటి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని చర్లపల్లి సర్పంచ్ జోగు లక్ష్మమ్మ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను సీరియస్ గా తీసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి గ్రామానికి రెండు కొత్త 25 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను మంజూరు చేశారు. అదే సమయంలో విద్యుత్ అధికారులను పిలిపించి పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ ఏఈ వీరన్న, లైన్ ఇన్స్పెక్టర్ కే. శ్రీనివాసులు, లైన్మెన్ రాఘవేందర్ ఆధ్వర్యంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో లో వోల్టేజ్ సమస్య పూర్తిగా తొలగిపోయింది. గృహాలకు నిరంతరాయ విద్యుత్ అందుతుండటంతో ప్రజలు ఊరట చెందారు. ఈ సందర్భంగా సర్పంచ్ జోగు లక్ష్మమ్మ మాట్లాడుతూ.. తమ గ్రామ సమస్యను వెంటనే పరిష్కరించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వేంకటరమణ, డిప్యూటీ సర్పంచ్ పావని అనిల్ కుమార్ గౌడ్, వార్డు మెంబర్లు తిరుపతి, శేఖర్, గోవర్ధన్, నందు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ గురుకులాలు కాదు సంక్షోభ గురుకులాలు

ఆర్మూర్ రెవెన్యూ డివిజన్, ఆగస్ట్ 12 (విజన్ ఆంధ్ర) : గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ గురుకులాలు "పైన పటారం లోన లోటారంగ " మారాయి "గత ప్రభుత్వం లో సంక్షేమ గురుకులాల్లో (11) సంవత్సరాలనుండి ఉపాధ్యాయులకు న్యాయ బద్దంగా చెందవలసిన ఆర్థిక లావాదేవీలు ఇవ్వకుండా వేధించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఎల్లారెడ్డి సంక్షేమ గురుకులాల్లో పని చేసి 2020 జనవరిలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, యన్. సి. సి. (ఆర్మీ ) ప్రథమ అధికారి బి. ఆర్. నర్సింగ్ రావు, ఆర్మూర్, వెల్పూర్, ఎల్లారెడ్డి లో పని చేసిన కాలంలో జులై 2015 నుండి జనవరి 2020 వరకు విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడలు, యన్. సి. సి. తో పాటు జాతీయ సమైక్యత శిబిరాల్లో ఆయా సంబంధిత అధికారుల అనుమతి తోనే విద్యార్థులతో స్వంత డబ్బులు వెచ్చించి పై పోటీల్లో పాల్గొన్నారు. రవాణా ఖర్చులు దిన సరి భత్యాలు గత (11) సంవత్స రాలనుండి సంఘీక సంక్షేమ గురుకులాల సొసైటీ చెల్లించ కుండా వేధించి నందున బాధిత నర్సింగ్ రావు పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయమై తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ను ఆశ్రయించి,సమాచారం చట్టం 19(3)ఆర్. టి. ఐ. ఆక్ట్ 2005,అప్పీల్ నెం.7560/ఎస్. ఐ. సి -ఏం. పీ./2025, తేదీ 06-02-2026 మరియు 18(1) ఆర్. టి. ఐ. ఆక్ట్ 2005, అప్పీల్ నెం.12119/ఎస్. ఐ. సి -ఏం. పీ./2026, తేదీ 05-08-2026 న కమిషన్ ముందు సంక్షేమ గురుకులాల అధికారులు హాజరై బిల్లులు దొరకడం లేదని తప్పుడు సమాచారం ఇవ్వడంతో కమిషన్ ముందు హాజరైనా బాధిత ఉపాధ్యాయుడు నాకు న్యాయ బద్దంగా రావలసిన నాపెండింగ్ బిల్ అదారాలు ఉన్నాయని నాకు ఆర్మూర్, వెల్పూర్, ఎల్లా రెడ్డి నుండి మొత్తం 1,56,348/- రావాల్సి ఉందని సంక్షేమ అధికారులు బిల్స్ వెతకలేక అశ్రద్ధ వహిస్తూన్నారని తేదీ 05-08-2026 న విచారణ లో కమిషన్ దృష్టికి తీసుక రావడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ "ఈ రోజు నుండి "వారంలోగ " బాధితుని తో కలిసి బిల్స్ మొత్తం వెతికి తీసుక రావాలని కమిషన్ అధికారి హుకుం జారీ చేసారు.

రికార్డులు దొరకాలంటే కాలజ్ఞాని మల్లి పుట్టాలా ?

గత (11) సంవత్సరాల రికార్డ్స్ ఎక్కడ ఉన్నాయో కనుక్కోవా లంటే కాల జ్ఞానీ పోతులూరి వీర బ్రాహ్మం మల్లి పుట్టాలా అని బాధిత ఉపాధ్యాయుడు సంక్షేమ గురుకులాల సంస్థ ఉన్నతఅధికారుల్ని ప్రశ్నిస్తున్నారు.

చెట్టకి ఏం చెబుతుంది

ఆర్మూర్ వెల్పూర్ పాఠశాలల్లో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లినసూపరింటెండెంట్ (1).వి. శ్రీనివాస్, అలాగే వెల్పూర్ ప్రిన్సిపాల్ (2).శ్రీమతి గోదావరి,పై పాఠశాలలో ప్రతి బిల్స్ లేదా అధికారిక పంపే లేఖలు సంబంధిత అధికారులకు పంపే ముందు రికార్డు కోసం పాఠశాలలో ఎందుకు భద్ర పరచ లేదు ? ఇదీ వాళ్ళ జాబ్ చార్ట్ లో ఉన్న...ఎందుకు డ్యూటీ పట్ల నిర్లక్ష్యం చేసారు ? బిల్స్ కనపడటం లేదని ఎలా సమాధానం చెపుతారని అని గురుకులాల సొసైటీ అధికారులు "శోకాజ్ నోటీస్ లను" ఎందుకు జారీ చేయడం లేదని ఇందులో లోపాయికారి ఒప్పందం ఏమిటో తెలియటం లేదని బాధిత నర్సింగ్ రావు ప్రశ్నిస్తున్నారు. ఏదేని ప్రభుత్వ కార్యాలయంలో పని చేసే తోటి సిబ్బందికి సంబంధించి న ఆర్థిక లావా దేవీలు జాప్యం చేయకుండా ఆయా ఆర్థిక సంవత్సరం లో చెల్లింపులు చేయాలి, ఏదైనా కారణం తో జాప్యం జరిగితే దాని వివరాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకవెళ్లి ఆర్థిక లావాదే వీలు అన్ని అదే ఆర్థిక సంవత్సరంలో లోనే క్లియర్ చేయించి సహా ఉద్యోగికి చెల్లింపులు చేయాలని ప్రభుత్వ చట్టం ఉన్న ఆయా సంబంధిత అధికారులకు తెలిసిన తెలియ నట్లు వ్యవహరిస్తు న్నారు. పైగ సహా ఉద్యోగి బిల్స్ మంజూరి కోసం పై అధికారులకు పంపించా మని మాకేంటి అనే ధోరణి అవలంభించి గతంలో పని చేసిన ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్స్ ల నిర్లక్ష్యం వల్లే (11) సంవత్సరా లుగా బిల్స్ పెండింగ్ సమస్య ఏర్పడింది. బిల్స్ ఎక్కడ ఉన్నాయో వెతికి తీసే బాధ్యత గతంలో పని చేసిన అధికారు లదే పూర్తి బాధ్యత లేని పక్షంలో నాపెండింగ్ బిల్స్ చెల్లింపుల విషయాన్ని సంక్షేమ గురుకులాల కార్యదర్శి,తో పాటు ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్స్ ల నిర్లక్ష్యం ధోరణి పై తెలంగాణ మానవ హక్కుల కమిషన్, తదుపరి లోకాయుక్త దృష్టికి తీసుక వెళతా నని రిటైర్డ్ ఉద్యోగి బీ. ఆర్. నర్సింగ్ రావు ఈ సందర్భంగా తెలియజేసారు.

### కొత్త ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డీఈఓ రమేష్‌కుమార్
### విద్యార్థుల అభ్యసన స్థాయిపై ఆరా.. ఉపాధ్యాయులకు పలు సూచనలు

కల్వకుర్తి ఆగస్టు 12 ( విజన్ ఆంధ్ర) : వెల్దండ మండలంలోని కోట్ర ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన డీఈఓ విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన విద్యా పునాది ఏర్పడేలా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధనకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఆయన విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించి అభ్యసనలో ముందుకు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డీఈఓ సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తూ ప్రాథమిక విద్యను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ప్రారంభం

### 3వ వార్డులో భూగర్భ డ్రైనేజీ..
### 22వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

కల్వకుర్తి (విజన్ ఆంధ్ర), ఆగస్టు 12: కల్వకుర్తి మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 3వ, 22వ వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆయా వార్డుల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా 3వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులను, 22వ వార్డులో సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కేతావత్ రాము, ఎజాస్, మక్బుల్, నాయకులు, శివకాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర సత్యం ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర ) ముదిరాజ్ బీసీ వర్గాల హక్కుల కోసం పోరాడిన పోరాట యోధుడు, బీసీ ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన ఎర్ర సత్యం ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. ఎర్ర సత్యం ముదిరాజ్ బీసీ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అనేక మంచి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు, పోరాటాలు బీసీ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఎర్ర సత్యం ముదిరాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కుల సాధన కోసం ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.బీసీ ప్రజలు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులు, న్యాయమైన వాటా సాధించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎర్ర సత్యం ముదిరాజ్ చూపిన పోరాట స్ఫూర్తితో బీసీ ప్రజలను ఏకం చేసి, వారి హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని రవి పటేల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, నాయకులు, ముదిరాజ్ నాయకులు పాల్గొని ఎర్ర సత్యం ముదిరాజ్‌కు ఘన నివాళులు అర్పించారు.

# ఇసుక మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం...

### 2 ట్రాక్టర్లు సీజ్
### కల్వకుర్తి తిరుపతి బైపాస్ వద్ద పట్టివేత...
### - కేసు నమోదు




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్టు 12 : అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టేందుకు కల్వకుర్తి పోలీసులు రంగంలోకి దిగారు. బుధవారం మధ్యాహ్నం కల్వకుర్తి తిరుపతి బైపాస్ వద్ద పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో లింగసాని పల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను పట్టుకున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్లను స్టేషన్ కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులు మరియు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు కల్వకుర్తి పట్టణ ఎస్సై కురుమూర్తి తెలిపారు. "అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు" అని ఎస్సై హెచ్చరించారు. జిల్లాలో ఇసుక మాఫియాపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.
ప్రజలకు విజ్ఞప్తి అక్రమ ఇసుక రవాణా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

## క్రషర్ మిషన్ ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలి

### -- పహిల్వాన్ పురం గ్రామపంచాయతీ వద్ద గ్రామస్తుల ఆందోళన

యాదాద్రి ఆగస్టు 12 వలిగొండ (విజన్ ఆంధ్ర) మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలో క్రషర్ మిషన్ ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలని పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రైతులు గ్రామపంచాయతీ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎలిమినేటి జంగారెడ్డి మాట్లాడుతూ గ్రామ శివారులో అక్రమంగా నిర్మిస్తున్న క్రషర్ నిర్మాణాన్ని గ్రామ ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా సర్పంచ్ ఏకపక్షంగా తీర్మానం చేసి క్రషర్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని గ్రామ సభలో ప్రజలు క్రషర్ నిర్మాణాన్ని చేపట్టవద్దని చెప్పినా వినకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా సర్పంచ్ ప్రయత్నిస్తున్నారని, క్రషర్ లీజు ఉన్న సర్వే నెంబర్లలో నిర్మాణాలు చేపట్టకుండా రైతులకు నష్టం కలిగించే విధంగా పొలాల మధ్యలో నిర్మాణం చేపట్టడం వల్ల అక్కడ పంట పొలాలు చెడిపోయి పశుపక్షాదులు పెంచడానికి సైతం ఇబ్బంది ఉ ంటుందని రైతులు తమ ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా నిర్మాణాన్ని నిలిపివేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముధోల్ ఆర్టీసీ బస్టాండ్ భూ సర్వే

ముధోల్: 12ఆగస్టు:విజన్ ఆంధ్ర : నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ ఆర్టీసీ బస్టాండ్ ను అధికారులు బుధవారం భూ సర్వే ను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, ఆర్టీసీ సిబ్బంది బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న స్థలాన్ని సర్వేయర్ , అధికారులు కొలతలను చేపట్టారు. బస్టాండ్ కు పరిమితి ఉన్న స్థల నాలుగు దిక్కుల హద్దులను గుర్తించారు. గుర్తించిన హద్దుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలను పంపించి త్వరలో ఇరు ప్రక్కల యజమానులకు నోటీసులను అందజేసి తుది విచారణ చేపడతామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని అక్రమాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని భైంసా డిపో మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి తెలంగ్ రావు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పటేల్, ఎస్సై బిట్ల పెర్సిస్, ఆర్టిసి ఎస్సై అకన్, సూపరెంట్ అజీరసరియా, ఎంపీవో శివకుమార్, పంచాయతీ ఈవో అన్వర్ ఆలీ,పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## శ్రావణమాస పూజలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

భీమదేవరపల్లి, ఆగస్టు 12(విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, వీరభద్ర స్వామి మాలాధారణ కార్యక్రమాలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను ఆహ్వానించారు.
ఈ మేరకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పి. కిషన్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రావణమాస ప్రత్యేక పూజలు, మాలాధారణ కార్యక్రమంలో మంత్రి పాల్గొనాలని కోరారు.



## రాణిపేట్ గ్రామానికి చెందిన అరవింద్ కుటుంబానికి అండగా నిలిచిన మండల విశ్వకర్మ నాయకులు

మిడ్జిల్ ఆగస్ట్ 12 విజన్ ఆంధ్ర : కమ్మరి అరవింద్ మరణానంతరం బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించిన మిడ్జిల్ మండల విశ్వకర్మ సభ్యులు, విశ్వకర్మ మండల అధ్యక్షులు కమ్మరి భాస్కర్ చారీ మాట్లడుతూ అరవింద్ కుటుంబానికి పూర్తి సానుభూతి తెలుపుతూ వారికి మనం అందరం అండగా ఉండాలని ఉంటామని భరోసా తెలియజేసి మండల కమిటీ ఆధ్వర్యంలో స్వీకరించిన 5000 రూపాయలు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జయంతి నిర్వాహక అధ్యక్షులు దశరథం చారి, ఉపాధ్యక్షులు నవీన్ చారి, శేఖర్ చారి, లక్షణ చారీ , ఆదిత్య చారి, రాఘవేంద్ర చారీ, ఆంజనేయులు చారి, తదితరులు పాల్గొన్నారు

## కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో చండీ హోమం

భీమదేవరపల్లి, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, పుర ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతంగా నిర్వహించేందుకు దేవస్థాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## చౌటకూర్‌లో పాఠశాలల నిధుల వినియోగంపై ఆడిట్

**- మండల విద్యాధికారి (ఎంఈవో) అనూరాధ సందర్శన**

చౌటకూర్, ఆగస్టు 12:- చౌటకూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2025--26 ఆర్థిక సంవత్సరంలో 'సమగ్ర శిక్ష' కార్యక్రమం ద్వారా మంజూరైన నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించారు. పాఠశాలలకు కేటాయించిన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా, వాటికి సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను ఆడిట్ బృందం పరిశీలించింది.

?ఆడిట్‌లో భాగంగా పాఠశాలల నిర్వహణ వినియోగ పత్రాలు, ఖర్చుల బిల్లులు, బ్యాంకు పాస్‌బుక్‌లు, నగదు పుస్తకాలు (క్యాష్ బుక్స్) తదితర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిధుల లెక్కలు, ఖర్చుల ఆధారాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

?ఆడిట్ కేంద్రాన్ని మండల విద్యాధికారి (ఎంఈవో) అనూరాధ సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఆడిట్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. పాఠశాల నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని, అవసరమైన బిల్లులు, పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనల మేరకే నిధులను పాఠశాల అవసరాలకు ఉపయోగించాలని, సంబంధిత వివరాలను నివేదికల రూపంలో ఆడిట్ బృందానికి సమర్పించాలని ఎంఈవో స్పష్టం చేశారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 12 సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2016పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో అవగాహన పాంప్లెట్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ,ప్రజలు తమ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను నాలుగు రకాలుగా (తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త మరియు శానిటరీ చెత్తను) వేర్వేరుగా చేసి, పురపాలక సంఘ వాహనాలకు అందించాలని తెలిపారు.పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బొల్లిశెట్టి రాజు, సంపత్, పూదరి వరప్రసాద్, బొల్లి శ్రీనివాస్,వైద్యం కిరణ్ ప్రసాద్,గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప, మున్సిపల్ అధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం,టీపీఎస్ సంధ్య,శంకర్, శివకుమార్, రవికుమార్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

**-- జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ**

యాదాద్రి ఆగస్టు 12 వలిగొండ (విజన్ ఆంధ్ర) 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల అధ్యక్షుడు బోల్ల సుదర్శన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో వలిగొండ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు భారత్ మాతాకీ జై, వందేమాతరం, జై హిందు, అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటారు, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛ భారతదేశంలో జీవిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు యువతలో దేశభక్తి భావనను మరింత పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరు దేశ అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు ఈ తిరంగా ర్యాలీలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు యువత మహిళలు వివిధ సంఘాల నాయకులు దేశభక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ వలిగొండ సర్పంచ్ వెంకట పాపిరెడ్డి,బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు యాదగిరి,బిజెపి సీనియర్ నాయకులు రాచకొండ కిష్టయ్య,కనతాల అశోక్ రెడ్డి, బందారపు రాములు,రాస వెంకట్,జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్,జిల్లా నాయకులు బచ్చు శ్రీనివాస్,మై సొల్లా మచ్చగిరి మండల పదాధికారులు నాగరాజు, రంజిత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, మండల కార్యదర్శులు వెంకటేశం,మహేష్,శ్రీనివాస్, మండల నాయకులు నరసింహ,రామచంద్రం,చిన్న మచ్చ గిరి,పెద్ద కిట్టు,వెంకటేశం, జంగయ్య,వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్రమత్తతోనే సైబర్ నేరాల నియంత్రణ



**- ఆన్ లైన్ మోసాల గురించి బాలికలకు అవగాహన కల్పించిన పోలీసులు.**

**- ఆన్ లైన్ మోసానికి గురైతే 1930 కు సమాచారం అందించాలని సూచన.**

కుల్కచర్ల, ఆగస్టు, 12(విజన్ ఆంధ్ర): అప్రమత్తతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కొండల్ రెడ్డి, కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్ తెలిపారు. సైబర్ క్రైమ్ జాగృత దివాస్ సందర్భంగా కుల్కచర్ల బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ మోసాల పట్ల బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్ళు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. విద్యార్థులు, యువత ఆన్ లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ లోన్ యాప్స్ జోలికి వెళ్లరాదని అపరిచిత వ్యక్తులతో ఓటీపీలు పంచుకోరాదని చెప్పారు. అంతేకాకుండా గుర్తు తెలియని లింకులు పట్ల జాగురుతంగా ఉండాలని వివరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లు తెలిస్తే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు సమాచారం అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సిములు గౌడ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ వేలంలో ప్రభుత్వానికి 2,47,000/- రూపాయలు జమ

కల్వకుర్తి, విజన్ ఆంధ్ర,ఆగస్ట్ 12: కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలో అక్రమ మద్యం రవాణా, అక్రమ కార్యకలాపాలకు సంబంధించి కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న 13 వాహనాలను బుధవారం వేలం వేశారు.

ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎక్సైజ్ కార్యాలయం, హైదరాబాద్ చౌరస్తా మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన వేలం పాటలో ప్రభుత్వానికి 2,47,000/- రూపాయల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

మొత్తం 13 వాహనాలను వేలం ద్వారా విక్రయించగా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నట్లు వివరించారు.



అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, వాహనాలను సీజ్ చేసి వేలం వేస్తామని జిల్లా ఎక్సైజ్ అధికారి ఎ. వెంకటేశ్వర రెడ్డి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీఐ వెంకట్ రెడ్డి, సిబ్బంది చంద్రయ్య, భాస్కర్ రెడ్డి, మనోహర్, సిద్దార్థ్, అనిల్, చంద్రశేఖర్, తులసి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి ఉండాలి..

ప్రతి హృదయంలో దేశభక్తి వెల్లివిరియాలి.. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలి.డా. చందుపట్ల కీర్తి రెడ్డి.

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర ) హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావు ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు.జిల్లా బీజేపీ అధ్యక్షులు నిశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో, భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్ టెంపుల్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన తిరంగా యాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

జాతీయ జెండాలను చేతబూని బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

అనంతరం డా. చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు."హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదు.. ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి భావాన్ని మరింత బలపరచడం" అని అన్నారు.ప్రతి కుటుంబం తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, జాతీయ జెండాను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని డా. కీర్తి రెడ్డి పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు."మన జెండా -- మన గౌరవం.. మన దేశం -- మన బాధ్యత. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి.. ప్రతి హృదయంలో దేశభక్తి వెల్లివిరియాలి" అని ఆమె అన్నారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ దేశభక్తి స్ఫూర్తితో ఘనంగా నిర్వహించాలని కీర్తి రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, జన్నే మొగిలి, ఎరుకల గణపతి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాలుగో వార్డు కౌన్సిలర్ కన్నం యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, పెండ్యాల రాజు గారు అర్బన్ అధ్యక్షులు సంపత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సేనాపతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుప్పటి భద్రయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దేశెట్టి గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిబ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజనాయక్, లీగల్ సెల్ కన్వీనర్ చీర్ల అశోక్ రెడ్డి ఎండోమెంట్ కన్వీనర్ జయపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డిజిల్లా కార్యదర్శి శివరాత్రి వేణు జిల్లా నాయకులు తుమ్మేటి రామిరెడ్డి తాటికంటే రవికుమార్ కంబాల రాజన్న మచనవేనీ రవీందర్ దొంగల కుమార్ మేనం తిరుపతి అర్బన్ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి . బీజేవైఎం నాయకులు ఊడత నాగరాజు లాడే శివ భగవాన్ వేసాల హరీష్ కోరే సుధాకర్ పొన్నల కొమురయ్య దేవేందర్ గట్టయ్య రాజకుమార్ అలాగే రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం
- రేపు సచివాలయంలో పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్



అక్కన్నపేట, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక పథకానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో మిషన్లు అందించడం పథకంలో కీలక అంశంగా ప్రభుత్వం పేర్కొంటోంది.

- సచివాలయంలో ప్రారంభోత్సవం

ఆగస్టు 13, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని జీ-29లో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

- ఇంటి నుంచే స్వయం ఉపాధి

కుట్టు వృత్తిలో నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందే అవకాశం కల్పించడంతో పాటు వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సొంతంగా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే పథకం ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.

రేపు పూర్తి వివరాలు

పథకం విధివిధానాలు, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెల్లడించనున్నట్లు సమాచారం. కార్యక్రమానికి బీసీ మంత్రులు, బీసీ ఎంపీలు, బీసీ ఎమ్మెల్యేలు, బీసీ ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకానున్నారు.

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించి, వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే దిశగా ఈ పథకం కీలక ముందడుగుగా నిలవనుంది.

# జటాశంకర్ ఆలయ సమస్యల పరిష్కారానికి వినతి

ముధోల్, ఆగస్టు 12: విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రంలో వీడీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. శ్రావణ మాసంలో నిర్వహించే వారాంత అన్నదాన కార్యక్రమాల నేపథ్యంలో ఆలయం వద్ద నెలకొన్న సమస్యలపై గ్రామ సర్పంచ్ షబానా బేగం ఏజాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.
ప్రభుత్వ ఆసుపత్రి నుంచి జటాశంకర్ ఆలయం వరకు సిటీ లైన్ ఉన్నప్పటికీ సరఫరా లేక వీధి దీపాలు వెలగడం లేదని, వైర్లు తెగిపోయాయని తెలిపారు. సిటీ లైన్‌ను పునరుద్ధరించాలని, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. వర్షాకాలంలో అన్నదానం, ఇతర కార్యక్రమాలకు ఇబ్బందులు కలగకుండా షెడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.
సర్పంచ్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు వరగంటి విట్టల్, వెంకటేష్, లక్ష్మణ్, గంగారం, నాగేష్, సాయినాథ్, బాబు, ఆనందరావు పటేల్, కేర్భ, వెంకటపూర్ పోతన్న, ఏ. నాగేష్, పందరి, మాజీ సర్పంచ్ అనిల్, మాజీ ఉప సర్పంచులు దశరథ్, గడ్డం సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

## -వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.. ఆరోగ్య సిబ్బందికి సూచన

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు, సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. బుధవారం నార్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)ను ఆదివాసీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జ్వరాలు, మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అనుమానిత కేసులను గుర్తించి సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని సూచించారు. నార్నూర్ పీహెచ్‌సీకి దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడడంతోపాటు అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓను కోరారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు తరలించే విధానం సమర్థంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై కూడా అధికారులు దృష్టి సారించాలని, తాగునీటి వనరుల కలుషితాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై భారత్ జిల్లా అధ్యక్షుడు పేందుర్ దీపక్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పేందుర్ సంతోష్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు అడా శ్రీరామ్, జై భారత్ ఎస్టీ పోరాట వేదిక ఉపాధ్యక్షుడు మరప గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాల్లో వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

తలకొండపల్లి,ఆగస్టు12(విజన్ ఆంధ్ర); లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా తలకొండపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం వంటి అంశాలపై విద్యార్థులు ఉత్సాహంగా వ్యాసాలు రాశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి పి. వినయ్ కుమార్,ద్వితీయ బహుమతి నరేష్,తృతీయ బహుమతి నిఖిత,కావేరి సాధించారు. విజేతలను లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన అన్నారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ చరణ్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్,ప్రణీష, ప్రమీల,పద్మ,వెంకన్న, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ

చేవెళ్ల, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ ముత్తంగి లావణ్యరాజశేఖర్ ఆకాంక్షించారు. చేవెళ్ల మండల పరిధి ఈర్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ లావణ్య రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వాటిని అందజేశారు. విద్యతోపాటు మంచి నడవడిక, క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఆమె సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దయాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అర్హులైన వారందరికీ ఆసరా ఫించన్లు అందించేలా చూస్తాం

కుల్కచర్ల, ఆగస్టు, 12 (విజన్ ఆంధ్ర): అర్హులైన వారందరికీ ఆసరా ఫించన్లు అందించేలా చూస్తామని కుల్కచర్ల ఎంపీవో భాస్కర్ గౌడ్, సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్ తెలిపారు. కుల్కచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఆసరా ఫించన్ల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నూతన ఫించన్ల కొరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వచ్చిందన్నారు. గ్రామంలో ఎవరైనా వితంతు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఉన్నట్లైతే సమాచారం అందించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుంటే ఫించన్లు పొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా దరఖాస్తు చేసుకునే సమయంలో సంబంధించిన ధృవీకరణ పత్రాలను జత చేసి గ్రామ పంచాయతీలో అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా నాయకులు మహిపాల్, పంచాయతీ సిబ్బంది వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రేణుకుంట్ల ప్రవీణ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

బెల్లంపల్లి ఆగస్ట్ 12 విజన్ ఆంధ్ర : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణుకుంట్ల ప్రవీణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన స్నేహితులు, అభిమానుల సహకారంతో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తా--పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో అమ్మ ఒడి ఎన్జీవో అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ సుమారు రెండు వందల నిరుపేదలు, యాచకులు, దినసరి కూలీలు, బాటసారులకు అన్నదానం చేసినట్లు టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్‌మాస్టర్ హనుమాండ్ల మధుకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజ్ కుమార్ దాసరి దుర్గ రాజేష్, సొత్కు శ్రీనివాస్, తాటికొండ చంద్రమౌళి, గజ్జెల్లి చంద్రశేఖర్, పాలేపు నర్సయ్య, ఇరుగురాల రాజకుమార్, ఆకుల మల్లేష్‌తో పాటు అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నేవరం తిరుమల చారి, ఎం.డి. రేహాన్, చెందుపట్ల లింగమూర్తి, ఎం.డి. యూసుఫ్, భరత్ రుషి, కేశబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**-ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలి**

**-విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన**

నార్నూర్,ఆగస్టు12(విజన్ ఆంధ్ర):వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాధన సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ మనోహర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు. అనంతరం టెలి మెడిసిన్ కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు.

గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలి

వర్షాకాలంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యటించాలని డాక్టర్ సాధన అన్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

గర్భిణీ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన పరీక్షలు నిర్వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి ఆస్పత్రి సేవలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, గ్రామాల్లో వైద్య సేవలపై చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని ఆమె సూచించారు.

# బోనాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించిన భాషా సాంస్కృతిక శాఖ

## - డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డిని సన్మానించిన ఎస్.పి. క్రాంతి కుమార్



హైదరాబాద్ డెస్క్, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 12: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగిన బోనాల పండుగ సందర్భంగా వివిధ దేవాలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖకు కృతజ్ఞతలు తెలియజేయబడ్డాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా తమ అభ్యర్థన మేరకు పలు ప్రముఖ దేవాలయాల వద్ద జానపద కళారూపాలు, సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేసినందుకు భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి,ఐఏఎస్ ను ఎస్.పి. క్రాంతి కుమార్ బుధవారం సాంస్కృతిక శాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు తెలిపారు. బోనాల పండుగను ప్రజలకు మరింత వైభవంగా, సాంస్కృతికంగా చేరువ చేసేందుకు భాషా సాంస్కృతిక శాఖ తీసుకున్న చర్యలు అభినందనీయమని ఆయన కొనియాడారు.

ఆలయాల్లో సాంస్కృతిక వైభవం

బోనాల సందర్భంగా రాష్ట్రంలోని గోల్కొండ, లాల్ దర్వాజా, ఉజ్జయిని మహంకాళి, బాలకాంప్ తదితర ప్రధాన ఆలయాల వద్ద భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కళాకారులతో, స్థానిక జానపద కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులకు బోనాలతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు చూసే అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు.

డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను మరింత గొప్పగా నిర్వహించడమే మా లక్ష్యం. ప్రజల అభ్యర్థన మేరకు ఆలయాల వద్ద కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. ముందుందు కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తాం" అని తెలిపారు.

# బెల్లంపల్లి–తాండూర్‌లో గ్రీన్ ప్రాజెక్టుకు శ్రీకారం



బెల్లంపల్లి ఆగస్ట్ 12 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో అటవీ శాఖ అధికారులు సమావేశమయ్యారు. డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్‌డీవో విజయ్, ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ పార్కుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేకు వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అర్బన్ పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పార్కులకు అవసరమైన స్థలాలు, అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. పార్కుల ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అర్బన్ పార్కులు అందుబాటులోకి వస్తే ప్రజలకు వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

# రెండు నియోజకవర్గాల మధ్య నలిగిపోతున్న ఊరుకొండ

**- ఓటు జడ్చర్లకు, పాలన కల్వకుర్తికి, జిల్లా నాగర్‌కర్నూల్‌కు...**

**- మండల గ్రామాల గందరగోళం..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 12:

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం పరిపాలనాపరంగా అతిపెద్ద గందరగోళానికి కేంద్రంగా మారింది. జిల్లా మహబూబ్‌నగర్‌కు, కలెక్టరేట్ నాగర్‌కర్నూల్‌కు, ఓటు జడ్చర్లకు, పాలన కల్వకుర్తికి అంటూ ప్రజలు నాలుగు వైపులా తిరుగుతున్న దుస్థితి ఏర్పడింది. దాదాపు మండల గ్రామాలలో ఉన్న జనాభా ప్రకారం ఈ మండలం తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కలిసింది. కానీ ఓటు హక్కు మాత్రం జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే ఉంది.

కేసీఆర్ హయాంలో వచ్చిన రెవెన్యూ డివిజన్

2016లో నూతన జిల్లాల ఏర్పాటు సమయంలో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ కోసం అన్ని పార్టీల నాయకులు, తెలంగాణ ఉద్యమ నేతలు, విద్యార్థి సంఘాలు, యువత, ఉద్యోగులు గట్టిగా పోరాటం చేశారు. వారి కృషి ఫలితంగా ఊరుకొండతో పాటు వెల్దండ, చారగొండ, వంగూరు మండలాలను కలిపి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. ఫలితంగా ఇప్పుడు ఊరుకొండ మండలానికి సంబంధించిన ఆర్డీవో, డీఎస్పీ,పోలీస్ సర్కిల్, సబ్-రిజిస్ట్రార్, ఇతర అన్ని శాఖల కార్యాలయాలు కల్వకుర్తికే ఉన్నాయి. ఏ చిన్న పని ఉన్నా ప్రజలు 20 కి.మీ ప్రయాణించి కల్వకుర్తి వెళ్లాల్సి వస్తోంది.

ఎవరిది బాధ్యత? తేలని సమస్య

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి "ఓట్లు మా నియోజకవర్గంలో పడ్డాయి,




అభివృద్ధి బాధ్యత మాది" అనే కోణంలో ఉన్న,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి "రెవెన్యూ డివిజన్ మా పరిధిలో ఉంది, మేము చూసుకుంటాం"అనే ధోరణిలో ఉన్న కానీ గ్రౌండ్‌లో మాత్రం రెండు వైపులా ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి అని అక్కడి ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. "ఓటు అడగడానికి ఒకరు, పని కోసం ఇంకొకరి దగ్గరికి వెళ్లాలంటే చివరికి మాకు మిగిలేది నిరాశే" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో ఆశ

కొద్ది రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఊరుకొండ పర్యటనలో స్థానిక దేవాలయ అభివృద్ధికి 10 కోట్లు ప్రకటించారు. నూతన మండలం కావడంతో ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్ శాఖ వంటి కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. నూతన భవనాల కోసం స్థల సేకరణ ప్రక్రియ ఇప్పుడు మొదలైంది.

గ్రామ స్థాయిలో తీవ్ర ఇబ్బందులు

రోడ్లు దాదాపుగా కొన్ని గ్రామీణ రోడ్లు బాగాలేక, వర్షానికి చాలా వరకు రాకపోకలు నిలిచిపోతాయి అని, తాగునీరు కోసం మిషన్ భగీరథ సరిగా కొన్ని చోట్ల అమలు కావడం లేదనే సమస్యలు ఉన్నాయని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వేసవిలో బోర్లపైనే ఆధారపడే పరిస్థితి వస్తుందని అన్నారు. వైద్యం విషయంలో పీహెచ్ సి లో సిబ్బంది కొరత కూడా ఉంటుందని, అత్యవసరానికి కల్వకుర్తి లేదా నాగర్‌కర్నూల్ వెళ్లే జిల్లాకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అలాగే విద్య విషయంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో ఇంటర్ విద్యార్థులు రోజూ 20 కి.మీ ప్రయాణం చేసి కల్వకుర్తి మరియు మిడ్జిల్ వంటి మండలాలకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు.

పాలన పరంగా ఒక పని కోసం జిల్లా నాగర్‌కర్నూల్, రెవెన్యూ కోసం కల్వకుర్తి, రాజకీయం కోసం జడ్చర్ల అంటూ 3 చోట్ల తిరగాల్సిన దుస్థితి ఉందని అంటున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రజల విజ్ఞప్తి

"రాజకీయాలు పక్కన పెట్టి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మరియు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి సంయుక్తంగా ఒక అభివృద్ధి కమిటీ వేసి ఊరుకొండను ఆదుకోవాలని,లేకుంటే గ్రామాల భవిష్యత్తు అంధకారమే" అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.